# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 326, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం - 07 - ఫిబ్రవరి - 2025


## కేసీఆర్ ఆదేశాలతో కేంద్ర మంత్రిని కలిశాం: కేటీఆర్



- ఢిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్
- యూజీసీ నిబంధనలను మార్చడంపై అభ్యంతరాలను ధర్మేంద్ర ప్రధాన్ కు తెలియజేశామని వెల్లడి
- రాష్ట్ర ప్రజలు ఉప ఎన్నికలు కోరుకుంటున్నారని వ్యాఖ్య

## నాణేనికి రెండో వైపు ప్రజలకు వివరించాలని మీడియా ముందుకు వచ్చాను: జగన్

### చంద్రబాబును నమ్మడమంటే పులినోట్లో తలపెట్టడమేనని అప్పుడే చెప్పా: జగన్

- తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో జగన్ ప్రెస్ మీట్
- సంపద సృష్టి చంద్రబాబు జేబులోనే జరిగిందన్న జగన్
- కేజ్రీవాల్ చేయలేని పని చంద్రబాబు చేసి చూపించారని ఎద్దేవా
- గ్రామాల్లో బెల్ట్ షాపులకు వేలం పాట నిర్వహించారని ఆరోపణ
- చంద్రబాబు అబద్ధాలు, మోసాలను ప్రజలకు వివరిస్తామన్న మాజీ సీఎం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తయిందని మాజీ ముఖ్యమంత్రి జగన్ గుర్తుచేశారు. ఈ తొమ్మిది నెలల కాలంలో ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలకు సంబంధించి నాణేనికి రెండో వైపు ప్రజలకు వివరించాలని మీడియా ముందుకు వచ్చినట్లు వివరించారు.

## తెలంగాణ కుంభమేళా.. మినీ మేడారం జాతరకు వేళాయె..



ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు 4 రోజుల పాటు మినీ మేడార జాతర జరగనుంది. గద్దెకి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన అనంతరం పూజామందిరాన్ని అలంకరించారు మండమెలిగె, గుడి మెలిగె పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు

## రిజర్వేషన్ల పేరుతో దేశ ప్రజలను మళ్లీ విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర



- కాంగ్రెస్‌ను మోదీ చీల్చి చెండాడారు
- రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కాంగ్రెస్ నేతలు జీవితాంతం అవమానించారని అన్నారు ప్రధాని మోదీ.
- ఎలాంటి గొడవలు లేకుండా దేశం లోని పేదలకు తమ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు మోదీ
- ఇప్పుడు జై భీమ్ నినాదాలతో కపటనాటకాలు ఆడుతున్నారని అన్నారు

న్యూఢిల్లీ : రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యావాద తీర్మానంలో మాట్లాడారు ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్‌ను మోదీ చీల్చి చెండాడారు. రిజర్వేషన్ల పేరుతో దేశ ప్రజలను మళ్లీ విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందన్నారు.

## ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ భేటీ

సమావేశం వివరాలు మీడియాకు తెలిపిన మంత్రి పార్థసారథి

రిజిస్ట్రేషన్ల కోసం అడ్వాన్స్ టైమ్ స్లాట్

రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్

## 'తల్లికి వందనం'.. డేట్ ఫిక్స్ చేసిన చంద్రబాబు

### అటు మంత్రులు.. ఇటు అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు

21 అంశాలను ఏపీ కేబినెట్ ఆమోదించింది.

- వచ్చే విద్యా ఏడాది నుంచి తల్లికి వందనం అమలుకు సిద్ధమవ్వాలి
- ఏప్రిల్‌లో మత్స్యకార భరోసాపై దృష్టి పెట్టాలన్నారు సీఎం చంద్రబాబు
- విద్యా ఏడాది ప్రారంభమయ్యేలోపే డీఎస్సీ పోస్టుల భర్తీ చేయాలి
- నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేలా చర్యలు తీసుకోవాలి



వివరాలు 2లో..

అమరావతి : తాజాగా నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో మహిళలు..ముఖ్యంగా విద్యార్థుల తల్లులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న - తల్లికి వందనం - పై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంతమంది తల్లులు ఈ పథకం కింద అర్హులు? అనే విషయాలపై అధికారుల నుంచివివరాలు తెప్పించుకుని పరిశీలించారు. ఈ పథకం కోసం తల్లులు ఎదురు చూస్తున్నారని.. పలువురు మంత్రులు చెప్పినట్టు తెలిసింది. ఈ పథకాన్ని అమలు మిగతా..2లో

## అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు: జై శంకర్




అక్రమ వలసదారులను భారత్ కు తిప్పి పంపిన అమెరికా

రాజ్యసభలో ప్రకటన చేసిన కేంద్ర విదేశాంగ మంత్రి

2009 నుంచి ఇలాంటి బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయని వెల్లడి

## ప్రకంపనలు పుట్టిస్తున్న చైనా ఏఐ డీప్ సీక్.. దక్షిణకొరియా నిషేధం




పెను ప్రకంపనలు పుట్టిస్తున్న డీప్ సీక్

కంప్యూటర్లు, డివైజ్ లలోని సమాచారాన్ని చైనా టెలికాం సంస్థకు చేరవేస్తోందని ఆరోపణలు

డీప్ సీక్ పై ఇప్పటికే నిషేధం విధించిన ఆస్ట్రేలియా, ఇటలీ, తైవాన

## భారత అక్రమ వలసదారుల తరలింపుపై అమెరికా స్పందన



104 మందిని ఎయిర్ ఫోర్స్ విమానంలో భారత్ కు డిపోర్ట్ చేసిన అమెరికా

దేశ భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అవసరమన్న అమెరికా

అది తమ దేశ విధానమని స్పష్టీకరణ

## సీఎం రేవంత్ రెడ్డికి ఝలక్?

# జంపింగ్ ఎమ్మెల్యేల యూటర్న్

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలు సంచలన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మాజీ మంత్రి దానం నాగేందర్ ఇంట్లో సమావేశమైన పది మంది ఎమ్మెల్యేలు.. సుప్రీంకోర్టు నోటీసులు, అసెంబ్లీ సెక్రటరీ జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. అనర్హత వేటు పడేలా బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడి చేయడం, కోర్టు తీర్పుపై ఆందోళన, మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిసిరాకపోవడం వల్ల వలస ఎమ్మెల్యేలు అంతా తిరుగుటపాకు సిద్ధమవ్వాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. 13 నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పరాజయం పాలవడం, ఆ తర్వాత కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ తో పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ చేతిని అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ న్యాయపోరాటం చేస్తోంది. గతంలో వీరిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు మూడు నెలల గడువు ఇచ్చింది. మిగతా..2లో



## లక్షల ఉద్యోగాలు తప్పక ఇస్తాం.. ఎన్నికల హామీ నిలబెట్టుకుంటాం: మంత్రి లోకేశ్



- రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించానన్నారు
- తమ ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీకి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు
- కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన కేంద్రానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి అండగా ఉండాలని కేంద్ర మంత్రులను కోరినట్టు ఏపీ ఐటీశాఖమంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసిన మిగతా..2లో

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్.. నిధుల విడుదలకు ఆమోదం



హైదరాబాద్ : జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టు బడి పథకం "కింద తెలంగాణకు రూ.176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నిర్దేశించిన మైలురాయిని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్రానికి జాతీయ రోడ్డు రవాణా శాఖ అదనపు ప్రోత్సాహక సహాయం అందించింది. తెలంగాణ ఈ పథకం ద్వారా మైల్ స్టోన్ 1లో రూ.51.5 కోట్లు , మైల్ స్టోన్ 2లో రూ.125 కోట్లకు అర్హత పొందింది. అంతే కాకుండా.. మోటార్ వెహికల్ ట్యాక్స్ కన్సెషన్ పథకం కింద తెలంగాణ రూ.50 కోట్లు అర్హత సాధించింది. మైల్ స్టోన్ -2 కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన మిగతా..2లో

# రిజర్వేషన్ల పేరుతో దేశ ప్రజలను మళ్లీ విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి గొడవలు లేకుండా దేశం లోని పేదలకు తమ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు మోదీ. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కాంగ్రెస్ నేతలు జీవితాంతం అవమానించారని అన్నారు ప్రధాని మోదీ. అంబేద్కర్ పేరు వింటే కాంగ్రెస్ నేతలకు చిరాకని , అందుకే ఆయనకు భారతరత్న ఇవ్వలేదన్నారు. ఇప్పుడు జై భీమ్ నినాదాలతో కపటనాటకాలు ఆడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నుంచి సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ ఆశించడం పెద్ద తప్పు అని, ఎందుకంటే ఇది వారి ఆలోచన, అవగాహనకు మించినదని మోదీ అన్నారు. కాంగ్రెస్ లాంటి పెద్ద పార్టీ ఒక కుటుంబానికి అంకితం అయిందని, అటువంటి పరిస్థితిలో అందరి మద్దతు, అందరి అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బీజేపీకి మొదటి ప్రాధాన్యత దేశమేనని, దేశ ప్రజలు మూడోసారి తమకు అవకాశం ఇచ్చారన్నారు. తమకు దేశమే అన్నింటికన్నా ముఖ్యం అని అన్నారు. మా విధానాలు, కార్యక్రమాలలో నిరంతరం దేశానికి సేవ చేయడానికి ప్రయత్నించామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపక్షాలలోనూ బుజ్జగింపు ఉండేదని, ప్రతిపక్షాలలోనూ బుజ్జగింపు రాజకీయాలు ఉన్నాయని విమర్శించారు. మా ప్రభుత్వం ఎస్సీ-ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం ద్వారా దళిత, గిరిజన సమాజ గౌరవం, భద్రత పట్ల తన నిబద్ధతను ప్రదర్శించిందన్నారు. నేడు, కులతత్వ విషాన్ని వ్యాప్తి చేయడానికి చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయని, మూడు దశాబ్దాలుగా ఉభయ సభలకు చెందిన OBC ఎంపీలు OBC కమిషన్‌కు రాజ్యాంగ హోదా ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూనే ఉన్నారన్నారని, కానీ అది తిరస్కరణకు గురవుతుందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం తాము ఒక ప్రణాళికను రూపొందించడమే కాకుండా దానిని క్షేత్రస్థాయిలో కూడా అమలు చేశామని ప్రధాని మోదీ అన్నారు. లింగమార్పిడి సమాజం హక్కులకు సంబంధించి, దానికి చట్టపరమైన రూపం ఇవ్వడానికి ప్రయత్నించామని వివరించారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో మహిళా శక్తి సహకారాన్ని ఎవరూ కాదనలేరన్నారు.

# ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు తెలిపారు. ఏపీ నాలెడ్జ్ సొసైటీ కెపాసిటీ బిల్డింగ్-2025కి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. గతంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ఉండేదని, ఇప్పుడు కేంద్రం పాలసీలకు తగినట్టు ఏపీ రాజధాని అమరావతిలో అలాంటి సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా పారిశ్రామికవేత్తలను ఆదుకునేలా ఎంఎస్ఎంఈ విధానంలో మార్పు లకు ఆమోదం లభించిందని తెలిపారు. విద్యుత్ సహా పలు విభాగాల్లో ఇండస్ట్రియలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదించినట్టు వివరించారు. "కోరమాండల్ సంస్థ కోరిన రాయితీ అంశా నికి ఆమోదం తెలిపాం. తిరుమలలోని లడ్డూ తయారీ పోటులో 15 మంది సూపర్ వైజర్ల నియామకానికి ఆమోదం లభించింది. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని రైతులకు పరిహారంపైనా నిర్ణయం తీసు కున్నాం. బాధిత రైతులకు ఎకరానికి రూ.8 లక్షలు ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయి ంచింది. రాష్ట్రంలో రిజి స్ట్రేషన్ల కోసం అడ్వాన్స్ టైమ్ స్లాట్ పెడుతున్నాం. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్ ఏర్పాటు చేస్తాం. పేదలకు ఇళ్ల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్టు వ్యవహరించింది. కూటమి ప్రభు త్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాం. పోలవరం నిర్వాసితుల ఇళ్లు త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశించారు. విద్యుత్ భారం ప్రజలపై పడకూడదని సీఎం చెప్పారు" అని మంత్రి పార్థసారథి వివరించారు.


# అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు: జై శంకర్

న్యూఢిల్లీ : అమెరికా ప్రభుత్వం భారత్ కు అక్రమ వలసదారులను ప్రత్యేక విమానంలో తిప్పి పంపిన నేపథ్యంలో, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్ నేడు రాజ్యసభలో ప్రకటన చేశారు. అక్రమ వలసదారుల తరలింపు అనేది కొత్తేమీ కాదని అన్నారు. చాలా ఏళ్ల నుంచి దేశ బహిష్కరణలు జరుగుతున్నాయని, 2009 నుంచి ఇలాంటి బహిష్కరణలు చూస్తూనే ఉన్నామని తెలిపారు. ఇలాంటి బహిష్కరణల సమయంలో కొందరు ప్రాణాలు కోల్పోతుంటారని వివరించారు. అక్రమ వలసలను అరికట్టేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉందని జై శంకర్ స్పష్టం చేశారు. ఒక్క భారత్ అనే కాకుండా... అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోందని వెల్లడించారు. తమ దేశస్థులు చట్టవిరుద్ధంగా విదేశాల్లో ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

# ప్రకంపనలు పుట్టిస్తున్న చైనా ఏఐ డీప్ సీక్.. దక్షిణకొరియా నిషేధం

న్యూఢిల్లీ : ఏఐ రంగంలో చైనాకు చెందిన చాట్ బాట్ డీప్ సీక్ పెను ప్రకంపనలు పుట్టిస్తోంది. దీని వినియోగంపై ఇప్పటికే పలు దేశాలు నిషేధం విధించాయి. తాజాగా దక్షిణకొరియా కూడా దీనిపై నిషేధం విధించింది. దక్షిణకొరియా రక్షణ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు దీనిపై స్పందిస్తూ... డీప్ సీక్ వినియోగంపై పలు దేశాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని... తాము కూడా దాన్ని నిషేధించాలని నిర్ణయించుకున్నామని తెలిపాయి. ఇంటెలిజెన్స్ అధికారులు దీని విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాయి. చైనా ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీతో డీప్ సీక్ కు సంబంధాలు ఉన్నాయని... కంప్యూటర్ కోడ్ ద్వారా యూజర్లకు చెందిన లాగిన్ సమాచారాన్ని ఆ టెలికాం సంస్థకు డీప్ సీక్ చేరవేస్తోందని పరిశోధకులు చెపుతున్నారు. కెనడాకు చెందిన ఫీరుట్ సెక్యూరిటీ సంస్థ దీన్ని గుర్తించి అసోసియేట్ ప్రెస్ వార్తా సంస్థతో పంచుకుంది. ఆ తర్వాత డీప్ సీక్ కు సంబంధించిన వివరాలను స్వతంత్ర కంప్యూటర్ నిపుణులు ధ్రువీకరించారు. ఈ ఆరోపణలలో డీప్ సీక్ కానీ, చైనా మొబైల్ సంస్థ కానీ స్పందించలేదు. ఇప్పటికే డీప్ సీక్ ను ఇటలీ, ఆస్ట్రేలియా, తైవాన్ దేశాలు నిషేధం విధించాయి. ప్రభుత్వ కంప్యూటర్లు, డివైజ్ లలో డీప్ సీక్ ను వాడటంపై ఆస్ట్రేలియా నిషేధం విధించింది. అయితే, వ్యక్తిగత డివైజులపై మాత్రం నిషేధం విధించలేదు. డీప్ సీక్ వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తైవాన్ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీ చేసింది. దేశంలో చాట్ బాట్ ను నిషేధిస్తున్నట్టు ఇటలీ డేటా ప్రొటెక్షన్ అథారిటీ వెల్లడించింది.

# తెలంగాణ కుంభమేళా.. మినీ మేడారం జాతరకు వేళాయే..



హైదరాబాద్ : ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళా అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు సమయం ఆసన్నమైంది. మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతర జరుగుతున్న సంగతి తెలిసిందే. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం ఈ నెల 12 నుంచి మినీ మేడారం జాతర ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు 4 రోజుల పాటు మినీ మేడార జాతర జరగనుంది. మినీ మేడారం జాతరకు అంకురార్పణ జరిగింది. అంటే జాతర ప్రారంభానికి సరిగ్గా వారం రోజుల ముందు గుడి మెలిగె, మండ మెలిగె పండుగను నిర్వహిస్తుంటారు. ఈ నెల 12న జాతర ప్రారంభం కానుండటంతో పూజారులు గుడి మెలిగె పండుగకు శ్రీకారం చుట్టారు. మేడారంలో గల సమక్క ఆలయంలో సిద్ధబోయిన వంశస్థులు, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో కాక వంశీయులు గుడి మెలిగె పండుగను నిర్వహించారు. ఈ గుడి మెలిగె పండుగలో భాగంగా పూజారులు గుడిని శుద్ధి చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి డోలు వాయిద్యాలతో అటవీప్రాంతంలోకి వెళ్లి గుట్టగడ్డిని తీసుకువచ్చారు. గడ్డికి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన అనంతరం పూజామందిరాన్ని అలంకరించారు. ఈ మండమెలిగె, గుడి మెలిగె పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు వెల్లడించారు. ఇప్పటి నుంచి మినీ జాతర ముగిసే వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పూజలతో పాటు రాత్రివేళల్లో డోలీలతో కొలుపును నిర్వహిస్తారు. అదే విధంగా కొండాయిలో గోవిందరాజులు, నాగులమ్మ జాతరను పురస్కరించుకుని మండమెలిగె పండుగను నిర్వహించారు. అలాగే పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారంలోని మినీ మేడారం జాతరకు రూ.32 కోట్లతో ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు దాదాపు 20 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులను కూడా మోహరించనున్నారు. మినీ మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, రవాణా, భద్రతా ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. భక్తుల రాకతో మినీ మేడారం జాతర జరిగేప పరిసరాలు కిటకిటలాడుతుంటాయి. గద్దెల ముందు భక్తులు పొర్లు దండాలు పెట్టి బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

# 'తల్లికి వందనం'.. డేట్ ఫిక్స్ చేసిన చంద్రబాబు ఏపీ సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



చేయాలనితనకు కూడా ఉందని కానీ. ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదన్న విషయాన్ని మహిళలకు వివరించాలని చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు. అయితే.. ఇప్పటికి ప్పుడు కాకుండా.. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. అయితే.. డేట్ ఎప్పుడనేది కూడా ఇంపార్టెంటేనని.. మహిళా మంత్రులు ప్రస్తావించారు. వచ్చే విద్యాసంవత్సరం జూన్ నుంచి ప్రారంభమవుతుందని.. చంద్రబాబు తెలిపారు. దీనిని బట్టి.. జూన్ లేదా జూలై నుంచి మాతృవందనం పథకాన్ని అమలు చేస్తే బాగుంటుందని చంద్రబాబు నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి.. గత రెండు వారాల కిందట తాను మీడియాతో మాట్లాడుతూ.. చేసిన ప్రకటనను ప్రస్తావించారు. మాతృవందనం పథకం కింద రూ.12 వేలు ఇస్తామని తాను చెప్పానని.. దీనిపై ఎక్కడా ఎలాంటి వ్యతిరేకత రాలేదని.. కాబట్టి రూ.12 వేలు ఇస్తే సరిపోతుందని వ్యాఖ్యానించారు. కానీ, దీనికి చంద్రబాబు విభేదించారు. ఎన్నికలకు ముందు.. రూ.15 వేలు ఇస్తామని చెప్పామని ఎన్నికష్టాలు వచ్చినా.. ఆ మాటను నిలబెట్టుకుం దామని ఈ విషయంలో రాజీ పడితే.. ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చినట్టు అవుతుందన్నారు. అంతేకాకుండా.. మహిళలు కూడా ఆశ పెట్టుకున్న నేపథ్యంలో అలా చేయడం సరికాదని.. కొన్నిరోజులు ఆలస్యమైనా.. చెప్పిన మాట ప్రకారం.. మహిళలకు రూ.15 వేల చొప్పున ఇద్దమని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో అటు మంత్రులు.. ఇటు అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. కేబినెట్ భేటీ తర్వాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఐదు కీలక సూచనలు చేశారు. వచ్చే మూడు నెలల పాటు జనంలోకి వెళ్లాలి. ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గేర్ మార్చి.. శాఖల పరంగా పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. ఇక అధికారులకు సైతం కీలక ఆదేశాలు ఇచ్చారు. వచ్చే విద్యా ఏడాది నుంచి తల్లికి వందనం అమలుకు సిద్ధమవ్వాలన్నారు. వచ్చే విద్యా ఏడాది ప్రారంభమయ్యేలోపే డీఎస్సీ పోస్టుల భర్తీ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ విధివిధానాలు రూపొంచించాలన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని.. అలాగే ఏప్రిల్‌లో మత్స్యకార భరోసాపై దృష్టి పెట్టాలన్నారు సీఎం చంద్రబాబు. పనితీరు ఆధారంగా మంత్రులకు ర్యాంకులు కూడా ఇచ్చారు. గేర్ మార్చాలి.. మంత్రులు ప్రజల్లోనే ఉండాలని చంద్రబాబు అంటున్నారు.

**మంత్రులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు..**

-వచ్చే మూడు నెలల పాటు మంత్రులు జనంలోకి వెళ్లాలి
-ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి
-ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు బాధ్యత తీసుకోవాలి
-మంత్రులు గేర్ మార్చాలి.. పనితీరు మెరుగుపడాలి
-పెట్టుబడులను పర్యవేక్షిస్తూ ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలి

# సీఎం రేవంత్ రెడ్డికి ఝలక్? జంపింగ్ ఎమ్మెల్యేల యూటర్న్

మొదటి పేజీ తరువాయి

ఈ గడువు కాలం తీరిపోయినా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నెల 10న ఈ పిటిషన్ పై విచారణ జరగనుండటంతో ఎమ్మెల్యేల్లో గుబులు రేగుతోందని అంటున్నారు. బీఆర్ఎస్ చర్యల వల్ల తమపై అనర్హత వేటు పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు ఎదుర్కోవడం కష్టమని మెజార్టీ ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో మాజీ మంత్రి దానం నాగేందర్ వంటివారు కాంగ్రెస్ పై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. తన ఇంట్లో కేసీఆర్ ఫోటో ఉంటే అభ్యంతరమేంటని ఈ మధ్యే ఆయన చేసిన వ్యాఖ్యలు అనేక అనుమానాలకు దారితీశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువ ఉందనే ఆలోచనతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు పునరాలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. దానం ఇంట్లో సమావేశమైన ఎమ్మెల్యేల్లో కొందరు ఈ ప్రతిపాదన తెచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ మారినా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్యాడరుతో సఖ్యత ఏర్పడకపోవడం, బీఆర్ఎస్ శ్రేణులు శత్రువుల్లా చూడటం వల్ల తాము రాజకీయంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఎక్కువ మంది ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ గులాబీ కండువాలు కప్పుకునేందుకు సామూహికంగా నిర్ణయం తీసుకుందామని కొందరు ప్రతిపాదించినట్లు సమాచారం. ఇదే జరిగితే సీఎం రేవంత్ రెడ్డికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లేనంటున్నారు. పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం కావడం, తనను నమ్మి పార్టీలోకి వచ్చిన పది మందిని కాపాడుకోలేని పరిస్థితి వస్తే రాష్ట్ర రాజకీయాల్లో భారీ కుదుపు చోటుచేసుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు జంపింగ్ ఎమ్మెల్యేలు తిరుగుటపా ఆలోచనల వల్లే సీఎం అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశానికి వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

# లక్షల ఉద్యోగాలు తప్పక ఇస్తాం.. ఎన్నికల హామీ నిలబెట్టుకుంటాం: మంత్రి లోకేశ్

మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించానన్నారు. వివిధ శాఖల మంత్రులతో ఆయా సమస్యలపై చర్చించామని, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం చేయాలనికోరినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆరా తీసినట్లు తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన కేంద్రానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీకి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ సేవలు, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ విస్తరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పలువురిని కలుస్తామని అన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకే ప్రశాంత్ కిశోర్‌ను కలిశామని, గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు భారీగా తగ్గారని మంత్రి లోకేష్ అన్నారు. ఐదేళ్లలో పాఠశాలల్లో చదివే విద్యార్థులు 45 లక్షల నుంచి 32 లక్షలకు తగ్గినట్లు లోమీడియాకేశ్ కు వివరించారు.

తెలంగాణ 'టాస్' పరీక్షల ఫీజు గడువు ఫిబ్రవరి 13 వరకు పెంపు


తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) పరిధిలో ఏప్రిల్ నెలలో పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు చెల్లించవల్సిన ఫీజు గడువును పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. తాజా ప్రకటన మేరకు రూ.50 ఆలస్య రుసుంతో ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని టాస్ సంచాలకుడు పీవీ శ్రీహరి ఓ ప్రటకనలో తెలిపారు. తత్కాల్ కింద ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్.. నిధుల విడుదలకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

రవాణా వాహనాలను తొలగించేందుకు స్క్రాపింగ్ ప్రణాళికను పంపించింది. ఈ స్క్రాపింగ్ పథకంతో మరో రూ.75 కోట్లు అర్హత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రాధాన్యతగా తీసుకుని పని చేయడం ద్వారా తెలంగాణ రూ.31.5 కోట్లు అర్హత పొందింది. ప్రాధాన్యత లేని జిల్లాలకు రూ.20 కోట్లు పొందేందుకు అర్హత పొందింది. ఈ మైలురాయి కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.51.5 కోట్లు. ఈ ఆర్థిక సాయం రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధికి ఉపయోగపడనుంది. ఇంతలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి అనుసంధానించే లింక్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదు పాయాల అప్ గ్రేడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటిం చాలని మంత్రి అధి,కారులను కోరారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లకు సంబంధించిన వివర ణాత్మక ప్రాజెక్టు నివేది కలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు ప్రాధా న్యత ఇవ్వాలని ఆయన అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన రోడ్ల పురోగతిని సమీక్షిం చడానికి సీనియర్ ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన మంత్రి.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# భారత అక్రమ వలసదారుల తరలింపుపై అమెరికా స్పందన




న్యూఢిల్లీ : అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారత వలసదారులను ఆ దేశం వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. మన దేశానికి చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన యూఎస్ ఎయిర్ ఫోర్స్ విమానం సీ-17 నిన్న మధ్యాహ్నం అమృత్ సర్ కు చేరుకుంది. మరోవైపు వలసదారులకు క్రిమినల్స్ మాదిరి సంకెళ్లు వేసి తరలించారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ అంశం ఈరోజు పార్లమెంట్ సమావేశాలను కూడా కుదిపేసింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై అమెరికా స్పందించింది. ఢిల్లీలోని యూఎస్ దౌత్య కార్యాలయ ప్రతినిధి మాట్లాడుతూ... తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను కఠినంగా అమలు చేయడం అత్యవసరమని చెప్పారు. అది తమ దేశ విధానమని అన్నారు. విమానంలో వలసదారుల ప్రయాణం గురించి ఇంతకు మించి ఏమీ మాట్లాడలేమని చెప్పారు. మరోవైపు, ఈ అంశంపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పార్లమెంట్ లో ప్రకటన చేశారు. అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా డిపోర్ట్ చేస్తోందని అన్నారు. 2012లో ఈ సంఖ్య 530గా ఉందని... ఇప్పుడు 2 వేలకు పైగా ఉందని చెప్పారు.

# కేసీఆర్ ఆదేశాలతో కేంద్ర మంత్రిని కలిశాం: కేటీఆర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఆయన పలువురు నేతలను కలిశారు. ఈ సందర్భంగా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కలిశామని... యూజీసీ నిబంధనలను మార్చడంపై తమ అభ్యంతరాలను తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించేలా కొన్ని నిబంధనలు ఉన్నాయని అన్నారు. గవర్నర్లకు అధికారాలు కట్టబెడుతూ రాష్ట్రాల పరిధిలో ఉన్న యూనివర్సిటీల్లోని నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తమ అభిప్రాయాలను యూజీసీకి కూడా తెలిపామని చెప్పారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయించిన నేతలకు సుప్రీంకోర్టు ఆదేశాలతో నోటీసులు జారీ అయ్యాయని... వారిపై అనర్హత వేటు పడాల్సిందేనని అన్నారు. సాయంత్రం ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు బయల్దేరుతామని తెలిపారు.

# నాణేనికి రెండో వైపు ప్రజలకు వివరించాలని మీడియా ముందుకు వచ్చాను: జగన్

మొదటి పేజీ తరువాయి



ఎన్నికల సమయంలో సంపద సృష్టించడం, సృష్టించిన సంపదను ప్రజలకు పంచడమే తన లక్ష్యమంటూ చంద్రబాబు ప్రచారం చేశారని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో సంపద సృష్టి నిజమేనని, అయితే అది చంద్రబాబు జేబులోనే జరిగిందని జగన్ తీవ్రంగా మండిపడ్డారు. ఢిల్లీలో కేజ్రీవాల్ చేయలేని పనిని ఏపీలో చంద్రబాబు విజయవంతంగా చేసి చూపించారని ఎద్దేవా చేశారు. మద్యం షాపులను ప్రైవేటీకరించే ప్రయత్నం చేసి కేజ్రీవాల్ జైలుకు వెళ్లారని చెప్పారు. అయితే, చంద్రబాబు మాత్రం కేంద్ర ప్రభుత్వాన్ని మేనేజ్ చేసి ఏపీలో మద్యం షాపులను విజయవంతంగా ప్రైవేటీకరించారని ఆరోపించారు. మద్యం షాపులకు టెండర్లు లేవు, లాటరీ విధానంలో తమ కార్యకర్తలకు కట్టబెట్టారని చెప్పారు. పోలీసుల సాయంతో మిగతా వాళ్లను బెదిరించి మద్యం షాపులన్నీ తమ కార్యకర్తలకే దక్కేట్లుగా చంద్రబాబు ప్రభుత్వం చక్రం తిప్పిందని ఆరోపించారు. మద్యం షాపుల కేటాయింపుల సందర్భంగా బెదిరింపులు, కిడ్నాప్ లు జరగడం జనం చూస్తూనే ఉన్నారని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులకు వేలం పాడడం తెలిసిందేనని, వేలంలో ఎక్కువ మొత్తం పాడిన వారికి బెల్ట్ షాపులు పెట్టుకోడానికి అనధికారికంగా అనుమతిచ్చారని విమర్శించారు. ఇలా బెల్ట్ షాపులు పెట్టుకున్న వారు ఎంఆర్పీ కన్నా ఎక్కువ రేటుకు అమ్మడం మన కళ్ల ముందే జరుగుతోందని జగన్ తెలిపారు. మద్యం షాపులు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉంటే ఈ సొమ్మంతా ప్రభుత్వ ఖజానాకే చేరేదన్నారు.

కాంట్రాక్టులలో నీకింత, నాకింత..

ప్రభుత్వం చేపట్టే పనులకు టెండర్లు పిలిచి, పనులు పూర్తయ్యాక కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించే పద్ధతికి కూటమి సర్కారు ప్రభుత్వం స్వస్తి పలికిందని జగన్ ఆరోపించారు. మొబిలైజేషన్ పేరుతో కాంట్రాక్టర్ కు ముందే చెల్లింపులు జరిపే పద్ధతి తెచ్చారని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పనులు ఇంకా ప్రారంభించకున్నా సరే కాంట్రాక్టులో పది శాతం చెల్లింపులు చేస్తోందని, అందులో 2 శాతం నీకు, 8 శాతం మాకు అంటూ ప్రభుత్వంలోని పెద్దలు పంచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విధంగా కాంట్రాక్టులలో నీకింత, నాకింత పద్ధతి కొనసాగుతోందన్నారు. వీటన్నింటితో రాష్ట్రంలో సంపద సృష్టి జరగడం కాదు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం ఆవిరవుతోందని జగన్ మండిపడ్డారు. ఇవన్నీ చూసి భరించలేక ఎవరన్నా నిలదీసే ప్రయత్నం చేస్తే రెడ్ బుక్ రాజ్యాంగంతో వేధిస్తున్నారని, హామీల గురించి అడిగిన వారిని వెటకారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఇసుక అమ్మకంలో స్కాం..

వైసీపీ ప్రభుత్వ హయాంలో కంటే రెట్టింపు రేట్లకు ఇసుక అమ్ముతున్నారని జగన్ ఆరోపించారు. ఇసుక, మద్యం, ఫ్లై యాష్.. ఇలా అన్నీ మాఫియాలేనని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గంలో, మండలంలో, గ్రామంలో పేకాట క్లబ్‌లు నడిపిస్తున్నారని చెప్పారు. ఇవన్నీ పెదబాబు, చిన్నబాబు ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెదబాబుకు ఇంత, చినబాబుకు ఇంత, దత్తపుత్రుడికి ఇంత అనే వ్యవహారం నడుస్తోందని చెప్పుకొచ్చారు.

బాబు ష్యూరిటీ, మోసానికి గ్యారంటీగా..

ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు సూపర్ సిక్స్ తో పాటు 143 హామీలు ఇచ్చారని, ఇంటింటికీ బాండ్లు పంచారని జగన్ గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే చొక్కా పట్టుకోండని ధీమాగా చెప్పారని అన్నారు. తొమ్మిది నెలల పాలన తర్వాత ఎన్ని హామీలు అమలయ్యాయి, ఆ మేనిఫెస్టో ఏమైందని నిలదీశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అన్న టీడీపీ ఎన్నికల నినాదం ఇప్పుడు 'బాబు ష్యూరిటీ మోసానికి గ్యారెంటీ' గా మారిందని జగన్ వ్యాఖ్యానించారు. మరి ఇప్పుడు ఎవరి చొక్కా పట్టుకోవాలని జగన్ నిలదీశారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబును నమ్మొద్దని ప్రజలకు ఎంతగానో విజ్ఞప్తి చేశానని, చంద్రబాబును నమ్మడమంటే పులి నోట్లో తలపెట్టడమేనని చెప్పినట్లు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని నిద్రలేపడమేనని చెప్పినట్లు గుర్తుచేశారు. గురువారం ఉదయం జగన్ మీడియా ముందుకు వచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో ఒక్క సంవత్సరం జరిగిన ఒడిదుడుకులను తీసుకుని ప్రజల్లో తప్పుడు ప్రచారం చేశారని చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలలలోనే ఏపీలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ఆరోపించారు. అప్పులు చేయడంలో చంద్రబాబు సర్కారు అన్ని రికార్డులను బద్దలు కొట్టిందని విమర్శించారు. ఈ తొమ్మిది నెలల కాలానికి బడ్జెటరీ అకౌంట్ అప్పులే రూ.80 వేల కోట్లని జగన్ వివరించారు. అమరావతి పేరుతో రూ.52 వేల కోట్లు, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయి ద్వారా రూ.8 వేల కోట్లు, ఏపీఎండీసీ ద్వారా రూ. 5 వేల కోట్లు.. మొత్తంగా రూ. 1.45 లక్షల కోట్లు అప్పులు చేశారని మండిపడ్డారు. మరి ఇన్ని అప్పులు చేసిన ప్రభుత్వం ఎన్ని బటన్ లు నొక్కిందని, ఎంతమంది పేదలకు డబ్బు పంచిందని జగన్ నిలదీశారు.

వైసీపీ ప్రభుత్వ పథకాలకు బ్రేక్

తమ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మత్స్యకార భరోసా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, లా నేస్తం, రైతు భరోసా, వసతి దీవెన తదితర పథకాలకు కూటమి సర్కారు మంగళం పాడిందని జగన్ ఆరోపించారు. ఆ పథకాలను నిలిపివేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను ఎలా మోసం చేసిందో చూశామని, కొత్తగా ఉద్యోగాలు కల్పించలేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.6 లక్షల మంది వలంటీర్లతోపాటు బెవరేజెస్ లోని 18 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. పీఆర్సీ ఛైర్మన్ తో బలవంతంగా రాజీనామా చేయించిన చంద్రబాబు సర్కారు.. ఐఆర్ పేరుతో ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా మూడు డీఏలు పెండింగ్ లోనే ఉన్నాయని ఆరోపించారు. ఒకటో తారీఖున జీతాలు ఇస్తున్నామని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. ఆర్థిక విధ్వంసం అంటే ఇదేనని జగన్ చెప్పారు. చంద్రబాబు చెప్పిన అబద్ధాలను, చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామని జగన్ తెలిపారు.

## బోలుగొడ్డు విమలదేవి దశదిన కార్యక్రమంలో పాల్గొన్న.... వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య..




పరకాల నియోజకవర్గం, శుభోదయం న్యూస్ : వరంగల్ రంగశాయిపేట మాజీ కార్పొరేటర్ బోలుగొడ్డు సారయ్య సతీమణి బోలుగొడ్డు విమలదేవి దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య..వీరితో పాటు మాజీ మేయర్ గుండా ప్రకాష్, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శ్రీమాన్, దిట్టి కుమారస్వామి,మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, పోషాల పద్మ, బాసాని శ్రీనివాస్, ధూపం సంపత్, బిల్ల శ్రీకాంత్, జన్ను రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల రాజు, కరాటే ప్రభాకర్, చాగంటి శ్రీనివాస్, బొలుగొడ్డు శ్రీనివాస్, డాక్టర్ హరి రమాదేవి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హరిహర త్రిశక్తి క్షేత్రంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలోని శ్రీ విద్యాపురంలో వెలసిన హరిహర త్రిశక్తి క్షేత్ర నవాలయ ఆవరణలో గురువారం రోజు 5 వ రోజు ఉదయం 8.00 గంటలకు శ్రీ మేధా దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవస్వామి వారికి పంచోపనిషత్ మంత్ర పారాయణంతో అభిషేకం, ఏలకులతో విశేష అర్చన, హయగ్రీవ స్వామి వారికి చందనోత్సవం, దక్షిణామూర్తికి గన్నేరు పూలతో పూజ, ప్రదోష కాలార్చన పూజ, వేద స్వస్తి, రాజోపచారములు, హారతి, మంత్రపుష్పం, ఏకాంతసేవ తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు హర హర త్రిశక్తి క్షేత్రంలోని అమ్మవారికి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భిన్నూరి గోపాలకృష్ణ, కమలాకర్ శర్మ, డాక్టర్ శ్రీనివాస్ గుప్తా, అనురాధ, మనోహరి, త్రిశక్తి క్షేత్ర ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ, హరి శర్మ, కృష్ణ కాంత్,రాకేష్, లోకనాథ్ తదితరులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ 5 వ రోజు బ్రహ్మోత్సవాలని విజయవంతం చేశారు.

## పేదల కడుపు కొట్టి, సంపన్నులకు దోచి పెట్టె విధంగా కేంద్ర బడ్జెట్




మోత్కూరు మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-2026 బడ్జెట్లో, పేదల కడుపుకొట్టి సంపన్నులకు దోచిపెట్టే విధంగా ఉందని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. గురువారం రోజున మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మికులకు, కర్షకులకు, మహిళలకు, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా, సంపన్న వర్గాలకు, పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేవిధంగా ఉందని అన్నారు. ప్రజలకు కొనుగోలు శక్తిని పెంచే ప్రతిపాదన కాని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించి, సామాన్య ప్రజలకు లాభం చేకూర్చులా ఏ ఒక్క అంశం లేదని విమర్శించ్చారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణా రాష్ట్రనికి తీవ్ర అన్యాయం చేసిందని, ఈ రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యే లు, 8 మంది ఎంపీ లు ఉన్నా, తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులు తేవడంలో బీజేపీ పూర్తిగా విఫలమైనదని అన్నారుఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు తనిఖీ చేసి, కేసు నమోదు చేసిన ఎస్ఐ




మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్ ): ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి, విక్రహించినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని, మోత్కూర్ ఎస్ఐ డి. నాగరాజు హెచ్చరించారు. గురువారం మోత్కూరు మున్సిపాలిటీలో అక్రమంగా మద్య నిలువ చేసి, మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుల పై రైడ్ నిర్వహించారు. నార్కట్పల్లి రోడ్డులో అక్రమంగా మద్యం నిల్వచేసి, బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ముకేర్ల శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి, 4000 రూపాయల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మోత్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వచేసి, విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

## 100% పన్నులు వసూలు చేయాలి



మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్ ): ఈ ఆర్థిక సంవత్సరం మున్సిపాలిటీలో పన్నులను 100 శాతం వసూలు చేయాలని, మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ కె. సతీష్ కుమార్ ఆదేశించారు. అందుకు ప్రజల కూడా సహకరించాలని కోరారు. గురువారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో పారిశుద్ధ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 తో ముగుస్తున్నందున 100 శాతం పన్నులు వసూలు చేయాలని, మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ మేనేజర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


## ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి కి,ఎమ్మెల్యే చిత్రాలకి పాలాభిషేకం



మోత్కూరు, మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్ ): మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో గాంధీనగర్ కాలనీలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపినందుకు రేవంత్ రెడ్డి,మందులు సామెల్ చిత్రాలకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీ నరసింహ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్ర గౌడ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఏబిసిడి వర్గీకరణ కోసం షెడ్యూల్ కులం లో ఎన్నో పోరాటాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట కట్టుబడి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి మొక్కవోని ధైర్యంతో వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, మెంట నరసింహ, పల్లి బిక్షం, కురెళ్ల శ్రీరాములు,పల్లపు సమ్మయ్య,మెంట నగేష్, మెంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 3 దశాబ్దాల కల సహకారం అయినందుకు మంత్రి దామన్నకు ఘన సన్మానం

### మంత్రి దామోదర రాజనర్సిమును ఘనంగా సన్మానించిన తెలంగాణ దండోరా నాయకులు.



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన సందర్భంగా, ఎస్సీ వర్గీకరణ కో-చైర్మన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన, తెలంగాణ దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దొమ్మాటి శివకుమార్ మాదిగ, రాష్ట్ర నాయకుడు మీసాల ఎల్లేష్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకునే అధికారాన్ని కల్పించింది. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను ఆమోదించారు. ఎస్సీ వర్గీకరణకు పూర్తిగా సహకరించిన, మంత్రి దామోదర రాజనర్సింహ ను వారి నివాసంలో కలిసి తెలంగాణ దండోరా సంఘం తరపున ఘనంగా సన్మానించడం జరిగినది తెలిపారు.

## తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఎంఎల్సీగా గెలిపించండి చిక్కా భీమేశ్వర రావు



ఏలూరు జిల్లా ప్రతినిధి, శుభోదయం న్యూస్ : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రముఖ న్యాయవాది చిక్కా భీమేశ్వర రావు ఈరోజు ది 06-02-2025 గురువారం ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు అధ్యక్షతన జరిగిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొని ఈ నెల 27వ తేదీన జరగబోవు పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఎంఎల్సీగా గెలిపించ వల్సిందిగా అభ్యర్థిస్తూ కోరారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతమనేని రమేష్ మరియు బీ నానాజీ ఎస్ఎన్ కట్టా కామిశెట్టి రమేష్, ఎం శివరామ కృష్ణ , నాగమురళి, కూనా కృష్ణారావు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.




## ముక్కెళ్ల వనసంరక్షణ సమితి కమిటీ చైర్మన్ గా తత్త గోవర్ధన్



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని ముక్కెళ్ల గ్రామానికి సంబంధించిన వన సంరక్షణ సమితి కమిటీ చైర్మన్ గా తత్త గోవర్ధన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ని వన సంరక్షణ సమితి సభ్యులతో అటవీ శాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో చైర్మన్ గా తత్త గోవర్ధన్, వైస్ చైర్మన్ గా దుబ్బరంగయ్యెల్ల రంగమ్మ, కమిటీ సభ్యులుగా బుడంపాటి రామయ్య,శ్రీహరి,గోరంట్ల లక్ష్మీదేవి, మానుకింది పద్మావతి,మునిరత్నం ల ను వన సంరక్షణ సమితి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన తత్త గోవర్ధన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ సహకారంతో అడవుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, సర్పంచ్ గౌరవ సలహాదారుడు రామచంద్ర, టిడిపి నాయకులు బాలు, చంద్ర, ఆదోని డివిజన్ అటవీశాఖ ఎఫ్ ఆర్ ఓ తేజస్వి, పత్తికొండ ఫారెస్ట్ డిఆర్ఓ రామచంద్రుడు, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు లక్ష్మణ్, రామ్మోహన్, రవి, భాస్కర్, శమిఉల్లాహ్, వన సంరక్షణ సమితి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతు పండించిన కంది పంట కు గిట్టుబాటు ధర కల్పించాలి..

### సిపిఐ జిల్లా సమితి సభ్యులు రోళ్ళపాడు వెంకటేష్...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): రైతు పండించిన కంది పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ గురువారం కడమకుంట్ల గ్రామ సచివాలయం ఎదుట రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు రోళ్లపాడు వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వము ప్రస్తుతము కందులకు రూ 7550 తో కొనుగోలు చేస్తుందని, అయితే 10వేల రూపాయల కు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే క్రాప్ బుకింగ్ తో సంబంధం లేకుండా రైతు పండించిన కందులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక తక్షణమే రైతుల ఖాతా లోకి కందులు అమ్మిన డబ్బులు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హనుమంతు, పలువురు సిపిఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు ఏర్పాటు చేసిన బుక్స్ ను పరిశీలించిన కంచర్ల, కోటపాటి



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): తిరుపతి శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులు కళాశాలలో వివిధ రకాల యాక్టివిటీస్ కమిటీలపై ఏర్పాటుచేసిన బుక్స్ ను శాసన మండల చీఫ్ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తో కలిసి పరిశీలించిన ప్రముఖ పారిశ్రామికవేత్త, రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ ఎస్కార్ట్ అలవెన్స్ అందజేత



దోర్నాల మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాలమండలం,దోర్నాల గ్రామంలోని పి ఎం సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం ట్రావెలింగ్ ఎస్కార్ట్ అలవెన్స్ కింద విడుదలైన నగదును ప్రధానోపాధ్యాయులు ఎస్వి నారాయణరెడ్డి స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు వై ఆంజనేయులు మరియు పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీ షేక్ ఖాదరవల్లి చేతుల మీదుగా గురువారం విద్యార్థినీ విద్యార్థులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ట్రావెలింగ్ అలవెన్సుకు కింద 18 మంది విద్యార్థులకు 3000 రూపాయలు చొప్పున 54000 మరియు ఎస్కార్ట్ అలవెన్స్ కింద నాలుగు మంది విద్యార్థులకు 3000 రూపాయలు చొప్పున 12000మొత్తంగా 66వేల రూపాయలు ప్రభుత్వం నుండి విడుదల అయినవి అనితెలిపారు.విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో రకాల అవకాశాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు .ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్ వలీ గారు ఉపాధ్యాయులు నాగమ్మూర్తి ,కిరణ్ ,చంద్రమౌళి మరియువిద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## డాక్టర్ ముక్కు ఉగ్రను వివాహ వేడుకలకు ఆహ్వానించిన మాలపాటి




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందించి వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన టిడిపి యువ నాయకులు మాలపాటి వెంకటేశ్వర రెడ్డి. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి, గోళ్ళ వీరబాబు, ఇర్రి శ్రీనివాసులు రెడ్డి, ఇర్రి శివారెడ్డి, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిరామ్ మెడికల్ కాలేజీ నంద్యాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





దోర్నాల మండల రిపోర్టర్-ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం,స్థానిక దోర్నాల యుటిఎఫ్ కార్యాలయం నందు ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు...ఈ మేరకు దోర్నాల పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు...!ఈ కార్యక్రమంలో శాంతి రాం మెడికల్ కాలేజి సిబ్బంది పాల్గొన్నారు. మరియు దోర్నాల మండలంలోని అనేకమంది వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు.

## బలిజ తెల్లగా కాపు కులాల వారు కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం




దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, దోర్నాల మండలంలోని బలిజ,తెలగ,కాపు కులాల వారు కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం క్రింద 2 లక్షల నుండి 5 లక్షల వరకు 50% సబ్సిడీతో కూడిన ఋణాల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్న ఎంపీడీఓ నాసర్ రెడ్డి.శుక్రవారం చివరరోజు అని తెలియజేశారు.అర్హత కలిగినవారు వెంటనే మీ సచివాలయంలో లేదా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్న ఎంపీడీఓ.కుల ధృవీకరణ పత్రం,ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు..



## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులను మర్యాద పూర్వకంగా కలిసిన గోస్టు సునీల్

ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): జనసేన పార్టీ సీనియర్ నాయకులు, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసిన పామూరు పట్టణ ఆర్యవైశ్య జనసేన యువ నాయకులు గోస్టు సునీల్. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఏపీలో ఉచిత బస్సుఉగాదికి ఫిక్స్




నూజివీడు ప్రతినిధి ఫిబ్రవరి 6. (శుభోదయం న్యూస్): ఏపీలో సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఉన్నా కూడా ఆచరణలో మాత్రం అడుగులు ముందుకు పడడం లేదు. అయితే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని కూటమి పెద్దలు గతేడాది ఎన్నికల వేళ హామీ ఇచ్చారు. మొదట దసరా.. ఆ తర్వాత సంక్రాంతి అన్నారు. ఇపుడు ఉగాదికి ఖచ్చితంగా మొదలు పెడతామని కూటమి మంత్రులు అంటున్నారు.

శుభోదయం
www.subhodayamdaily.com
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!
శుక్రవారం -07 -ఫిబ్రవరి-2025

## సింగరాయకొండలో ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్టు




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకుల్ని పట్టుకున్న సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ హాజరత్తయ్య మరియు సింగరాయకొండ ఎస్సై బి .మహేంద్ర..ఇటీవల వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా, సింగరాయకొండ సర్కిల్ లో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏ ఆర్ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డి.ఎస్.పి ఆర్ శ్రీనివాసరావు సింగరాయకొండ సిఐ సిహెచ్ రత్తయ్య ఆధ్వర్యంలో సింగరాయకొండ ఎస్సై బి మహేంద్ర కందుకూరు రోడ్డు అండర్పాస్ వద్ద అరెస్టు చేసి వారి నుండి ఆరు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీ చేస్తున్న ముఠా గుట్టును సింగరాయకొండ పోలీసులు గురువారం రట్టు చేశారు. అందుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 6 ద్విచక్ర వాహనాలతో పాటు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ రూ. 4 లక్షల ఉంటుందని వారు వివరించారు.కందుకూరు పట్టణంలోని బండ పాలెంకు చెందిన నీలి శెట్టి గురునాథం తండ్రి శ్రీనివాసులు వయసు (19) సంవత్సరాలు యనమల దినేష్ తండ్రి రమణయ్య వయసు (19) సంవత్సరాలు. జల్సాలకు అలవాటు పడిన వీరూ ఓ ముఠాగా ఏర్పడి ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు చెప్పారు..

## ఎంపీ మాగుంట బైపాస్ సర్జరీ

### విజయవంతం కావాలని పూజలు చేసిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర





కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి బైపాస్ సర్జరీ విజయవంతం అయ్యి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కనిగిరి కొత్తూరు లో వెలసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహా రెడ్డి, టిడిపి నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## సింగరాయకొండ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత కళాశాలలో ఎన్ డి ఆర్ ఎఫ్ అవగాహన సదస్సు..



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ సేవ అమోఘమని కమాండెంట్ వివిఎన్ ప్రసన్న కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సింగరాయకొండ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత కళాశాలలో జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం హెడ్ మాస్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో అవగాహన శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. రసాయన, జీవ, రేడియోధార్మిక, అణు సంబంధిత విపత్తులను ఎదుర్కొనే సందర్భంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రజలను కాపాడే పద్ధతులను ప్రత్యక్షంగా తమ బృందం ద్వారా ప్రయోగాత్మకంగా చూపించారు. భూకంపాలు, తుఫాన్లు లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు పాటించవలసిన పద్ధతులను వివరించారు. సీపీఆర్ లాంటి పద్ధతుల ద్వారా ప్రజల ప్రాణాలను ఎలా కాపాడవచ్చో చూపించారు. ఈ కార్యక్రమంలో అదనపు శ్రీ వివిఎన్. ప్రసన్న కుమార్ కమాండెంట్ టెన్త్ ఎన్ డి ఆర్ ఎఫ్ టీం కమాండర్ మన్ మోహన్ యాదవ్ మాట్లాడుతూ... విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ సేవ అమోఘమని, ప్రపంచంలోనే ఉత్తమదళం మనదేశంలో ఉండడం మనకు గర్వకారణంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ టీ .రవి మరియు డిప్యూటీ తాసిల్దార్ ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్నకుమార్ మరియు కళాశాల హెడ్మాస్టర్ రవి చంద్ర, కళాశాలల, విద్యా ర్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రవిచంద్ర కమాండెంట్ వివిఎన్ ప్రసన్న కుమార్ కు అభినందనలు తెలిపారు..



## మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఆరికట్ల బ్రహ్మారెడ్డి అమ్మ గారి మృతదేహానికి నివాళు లర్పించిన కనిగిరి మరియు వెలిగండ్ల జడ్పిటిసిలు

కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి మండలం చాకిరాల పంచాయతీ భూతం వారి పల్లెలోని ఆరికట్ల బ్రహ్మారెడ్డి అమ్మగారు అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరపతి రెడ్డి,మాజీ సింగల్ ప్రెసిడెంట్ ఒంటిపెంట వెంకటరెడ్డి మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్ గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం




విజయవాడ ఎన్టీఆర్ జిల్లా: (శుభోదయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్ వి.నరేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.అయన మాట్లాడుతూ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టాలని ప్రభుత్వం చూస్తుందని, దాన్ని రద్దు చేయాలని, ఏటీఎస్ పై కమిటీ ఏర్పాటు చేసి లారీ యజమానులను సంప్రదించి తగు నిర్ణయం తీసుకోవాలని అన్నారు.మైనింగ్ కి సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అన్ని ఇసుక మరియు ఇతర మైనింగ్ క్వారీలలో అమలు చెయ్యాలి. ఈ విధమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి సీనరేజ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్వారీలలో లోకల్, నాన్ లోకల్ విధానాన్ని రద్దు చేయాలని,అన్ని ఇసుక క్వారీలు మరియు క్రషర్లలో ప్రతి ట్రిప్పుకు ధర కనిపించేలాగా మైనింగ్ బిల్లులు ఇవ్వాలి.ప్రభుత్వం గ్రీన్ టాక్స్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లో తగ్గిస్తామని చెప్పి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ హామీలు నెరవేర్చలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి గ్రీన్ టాక్స్ తగ్గించవలసిందిగా కోరుచున్నాము.టిప్పరు యజమాని మనుగుడ, ఉనికి కోల్పోకుండా ఉండేలాగా ప్రభుత్వం ఆదుకోవాలని, దానికి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర టిప్పర్ యజమానుల అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.ఆర్టీవో అధికారులు, మైనింగ్ అధికారులు వేస్తున్న అధిక పెనాల్టీలను కట్టలేని పరిస్థితుల్లో యజమాని ఉండగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించవలసిందిగా మనవి చేసుకుంటున్నాం.తెలంగాణలో గవర్నమెంట్ పెట్టిన ఏటీఎస్ విధానాలను ఇక్కడ కూడా అమలు చేయాలి.ఏ టి ఎస్ ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రైవేటు కరణ చేయకూడదు. దీనికి సెంట్రల్ గవర్నమెంట్ ఫండ్స్ వస్తాయని, నేషనల్ హైవేస్ వారు ఇస్తారని అన్నారు. ఏటిఎస్ ప్రైవేటుకరణ వలన ప్రమాదాలకు, అక్రమాలకు తావు ఉందని, కొన్ని రాష్ట్రాలలో ఏ టి ఎస్ ప్రైవేట్ వారికి ఇచ్చినందువలన అవకతవకలు జరిగాయని, వాటిని ఇప్పుడు ఎత్తివేసారని, మరలా మన రాష్ట్రంలో పెట్టడానికి చూస్తున్నారని కావున వారిని అంగీకరించకూడదని అన్నారు. ఒకవేళ ప్రభుత్వమే ఏ టి ఎస్ ను నిర్వహిస్తే జిల్లాకు ఒక ఏటిఎస్ కాకుండా, ప్రతి జోన్ కి ఒక ఏటిఎస్ ఏర్పాటు చేయాలని అన్నారు ఈ సమావేశంలో ఎన్.ఫణి కుమార్, స్టేట్ జనరల్ సెక్రెటరీ,వడ్లమూడి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారుడు,గంగవరపు మురళీమోహన్.వైస్ ప్రెసిడెంట్,శీలం వెంకటేష్. ఎగ్జిక్యూటివ్ మెంబర్,సింగినీడి శ్రీనివాసరావు, తది తరులు పాల్గొన్నారు.

# సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

### సత్య సాయి బాబా శతజయంతి ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమస్యలు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



శ్రీసత్య సాయిజిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్): శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, పుట్టపర్తినీ అత్యంత సుందరీకరణ పట్టణంగా తీర్చిదిద్దుతాం,బాబా నడయాడిన చిత్రావతి పవిత్ర పుణ్య నదిగా గుర్తిద్దాం,10 లక్షల మంది భక్తులు కు తగ్గట్టుగా ఏర్పాట్లు ఉండాలిబాబాశతజయంతి ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్యసాయి బాబా100వ జయంతోత్సవాలను అత్యంత



ఘనంగా నిర్వహిద్దామని అందుకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వ అధికారులు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికార యంత్రాంగానికి సూచించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్ లో కలెక్టర్ చేతన్ అధ్యక్షతన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా100వ జయంతోత్సవాలపై జిల్లా ఎస్పీ రత్నా, ట్రస్ట్ సభ్యులు రొమర్ ,చలం, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా ప్రభుత్వ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడారు. సత్యసాయిబాబా 100వ జయంతోత్సవాలు ఈ ఏడాది నవంబర్ మాసంలో ప్రారంభమవుతాయని గుర్తు చేశారు. ఆవేడుకలకు సుమారు135 దేశాల నుంచి బాబాభక్తులు పుట్టపర్తికి విచ్చేస్తారని అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. బాబా వందో జయంతోత్సవాలకు సుమారు పదిలక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని ట్రస్ట్ సభ్యులు రోమర్ ,చలపతి లు ఎమ్మెల్యే ,కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సత్య సాయి బాబాకు135దేశాల్లో భక్తులు ఉన్నారని వారితో పాటు వివిధ దేశాలకు చెందిన మంత్రులు గవర్నర్లు ఈ వేడుకలకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రపతి తో పాటు ప్రధాని , ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులు,గవర్నర్లు,మాజీ ముఖ్యమంత్రులు,ప్రధాన న్యాయమూర్తులు మాజీ న్యాయమూర్తులు వంటి ప్రముఖులు కూడా వస్తారని వారికి కావలసిన ఏర్పాట్లు భద్రత వసతులు వంటి వాటిపై ప్రభుత్వ అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని తగిన ఏర్పాట్లు సమకూర్చుకోవాలని తెలిపారు. అదేవిధంగా సత్యసాయిబాబా నడయాడిన చిత్రావతి పరివాహ ప్రాంతాన్ని పుణ్యనదిగా భావించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తగిన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. బాబా 100 వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించి ఈ ఉత్సవాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కోరినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులకు వెల్లడించారు. ఈ విషయంపై తనతోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్ ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. బాబా వేడుకలకు ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందే విధంగా ప్రత్యేకంగా ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి తెలిపారు. పుట్టపర్తి పట్టణంలో రోడ్లు అందంగా సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.10 లక్షల మంది భక్తులకు సరిపడే మరుగుదొడ్లు ,పారిశుధ్యం, త్రాగునీరు,మెడికల్ క్యాంపులు, ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు, రైల్వే ద్వారా ప్రత్యేక రైళ్లు సౌకర్యం భక్తులకు భోజన సౌకర్యం, వైద్యశిబిరాలు వాటిపై ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకునే విధంగా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. అంతేకాకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పోలీస్ యంత్రాగం తీసుకోవాలన్నారు. ఈ వేడుకలకు ప్రముఖులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక హెలిపాడ్లు ఏర్పాటు చేయాలని కోరారు అంతేకాకుండా పుట్టపర్తికి వచ్చే రహదారులను అందంగా తీర్చిదిద్దాలని అందుకు అవసరమయ్యే నిధులు ఎంత అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. బాబా 100 వ జయంతోత్సవాలపై సంబంధిత అధికారులు తగిన నివేదికలు తయారుచేసి ప్రతిపాదనలు పంపాలని జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ప్రతినెలా అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి వేడుకల సందర్భంగా పనుల ప్రగతిపై ప్రత్యేక అధికారులను నియమించే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ ,డిపిఓ , వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రెవిన్యూ అటవీ ఎక్సైజ్ అగ్నిమాపక ,మున్సిపల్ ,డిపి ఆర్వో ,ఇతర శాఖల అధికారులు ,పుట్టపర్తి నియోజకవర్గ ఆర్డీఓ సువర్ణ ,రెవిన్యూ , డి.ఎస్.పి విజయకుమార్ , ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, అధికారులు మున్సిపల్ ,పుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచండి

### పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



శ్రీసత్య సాయిజిల్లా బ్యూరో వై.పోతులయ్య (శుభోదయం న్యూస్): కార్పొరేట్కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచండి అని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించే చర్యలు తీసుకుంటామని,10 వతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి.నియోజకవర్గంలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలి,మంత్రి నారాలోకేష్ చొరవతో గత వైసిపి పాలనలో బకాయి ఉన్న రూ.718 కోట్లు విద్యార్థుల పెండింగ్ బకాయిలు చెల్లింపు జరుగుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సుందరరెడ్డి తెలిపారు,కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు.నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న విద్య సమస్యలపై విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్ష నిర్వహించారు.సమీక్షకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఆర్డీఓ సువర్ణ,డీఈవో కిష్టయ్య హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ పేద కుటుంబాలకు చెందిన వారేనని వారికి కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మన ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఎంతో ఉందని గుర్తు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని , అందుకు తగ్గట్లుగా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై తక్షణం గుర్తించి వాటిని అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు ,ఫర్నిచర్ తోపాటు విద్యార్థుల రికార్డులను భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎంఈఓ లకు , ప్రభుత్వం ప్రధాన ఉపాధ్యాయులకు ఉందనీ ఎమ్మెల్యే తెలిపారు. ఆయా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థుల రికార్డులతో పాటు ఉపాధ్యాయులకు ,విద్యార్థులకు సంబంధించిన మెటీరియల్స్ ,ఇతర ప్రభుత్వ సామాగ్రిని అత్యంత భద్రంగా ఉండే విధంగా నైట్ వాచ్మెన్లను నియమించుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా లేని చోట వెంటనే వారిని భర్తీ చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడు జరిగే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోవాలని నియోజకవర్గంలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా అందుకు తగిన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతేకాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత , మరుగుదొడ్ల సమస్య త్రాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు కింద చాలా ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణ పనులు , భవనాల నిర్మాణ పనులు జరిగాయని కొన్నిచోట్ల నిధుల సమస్యతో అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయని కొంతమంది ఎంఈవోలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి వాటిపై తనకు నివేదికలు ఇస్తే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో చాలాచోట్ల ఎం ఆర్ సి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటికి మరమ్మతులు లేదా నూతన భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వం ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఎక్కడ డ్రాప్ ఔట్స్ ఉండకూడదని అందుకు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యత పై అవగాహన కల్పించి విద్యార్థులను సక్రమంగా బడికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు . ప్రభుత్వ పాఠశాలలో పుట్టపర్తి నియోజకవర్గం లో ఎక్కడా మూత పడకూడదని అందుకు తగినంత మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే విధంగా విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను కోరారు. ప్రభుత్వం నుంచి విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు బడ్జెట్ను కేటాయించిందని అందుకు తగ్గట్టుగా విద్యా బోధన ఉండాలని తెలిపారు. గత వైసిపి పాలనలో బకాయి పడిన విద్యార్థుల పెండింగ్ బిల్లులను మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రూ.718 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఏమాత్రం రాజీ పడదని అన్నారు. విద్యార్థుల నాణ్యమైన బోధన ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ లభిస్తుందని అర్హత ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ బడులే మిన్న అనే విధంగా పుట్టపర్తి నియోజకవర్గం లో విద్యాశాఖ పనిచేయాలని సూచించారు. సమీక్షలో నియోజకవర్గానికి సంబంధించిన 6 మండలాల విద్యాశాఖ అధికారులు గోపాల్ నాయక్ ,మోహన్ బాబు ,జయచంద్ర ,రెడ్డప్ప, ప్రసాద్ ,ఖాదరవలి ,రమణ ,సురేష్ ,జిలాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని మధుశ్రీ చదువుకు సహాయం అందించలని వినతి...



తిరుపతి, శుభోదయం న్యూస్ : తిరుపతిలో కడప జిల్లా రైల్వేకోడూరు బయనపల్లి ఓబనపల్లి గ్రామానికి చెందిన రజక కైలాసపతి, రమాదేవి దంపతులు రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఏపీ %ఉ% టీజీ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ ని కలిసి వారి కుమార్తె మధుశ్రీ బీటెక్ ఫస్ట్ ఇయర్ వరకు చదివిన సర్టిఫికెట్స్ జిరాక్స్ లను అందజేశారు. తమ కుమార్తె చదువులో మంచి టాపర్ అని మధుశ్రీ కి భవిష్యత్ లో ఉన్నత విద్యా చదువుకోవడానికి సహకారం అధించాలని వారు కోరారు. తల్లిదండ్రులు ఇద్దరు బట్టలు ఉతికి పిల్లలను చదివిస్తున్నామని వారు చెప్పారు.శంకర్ కచ్చితంగా తమవంతు సహకరంఅందిస్తానని వారికీ మాట ఇచ్చారు. విద్యాపరంగా మధుశ్రీని ప్రోత్సహించాలని, మంచిగా చదువుకునే వాతావరణం కల్పించాలని శంకర్ సూచించారు.

## స్వర్గీయ మట్టా తాతారావు జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం

రామచంద్రపురం :: రామచంద్రపురం పట్టణానికి చెందిన స్వర్గీయ మట్టా వెంకటరమణ (తాతారావు) జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు మట్టా నాగమణి, మట్టా రామకృష్ణ, మట్టా శ్రీనివాస్, మట్టా మణికంఠ లు గురువారం రామచంద్రపురం పట్టణం పాత బస్టాండ్ వద్ద ఉన్న సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ నందు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఇక్కడికి వచ్చి భోజనం చేసిన పేదలంతా అన్నదాత సుఖీభవ! అంటూ ఆనందంగా ఆశీర్వచనం పలికారు. పాత బస్టాండ్ లో కూర్చుని తినడానికి తిండి లేక అలమటిస్తున్న ఎంతోమంది వృద్ధులను రోజు చూస్తూ ఉన్న అదే సెంటర్లో పూలు అమ్ముకునే నాగిరెడ్డి వెంకన్న వ్యధ చెంది సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ అను సేవా సంస్థను సుమారు 6 సంవత్సరాల క్రితం స్థాపించి, పూలు అమ్మగా వచ్చిన డబ్బులతో ప్రతిరోజు పేదలకు అన్నం పెట్టడం మొదలుపెట్టారు. ఆ విధంగా పుట్టిన సేవా సంస్థే సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్. ఈ ట్రస్ట్ చైర్మన్ పూల అమ్ముకుని వచ్చిన ఆదాయంతో ఇప్పటికీ ఈ సంస్థను నడిపిస్తున్నారు. దాతలు ఎవరైనా ఈ పుణ్యకార్యానికి ముందుకు వచ్చి సహకారం అందిస్తే బాగుంటుంది అన్న భావనను నాగిరెడ్డి వ్యక్తం చేస్తున్నారు. తమ ట్రస్ట్ ఆవరణలో ఇంకా ఎవరైనా శుభకార్యాలను,పుణ్య దినాలను పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేయాలని సంకల్పించినట్లైతే 9347396318 అనే నెంబరు కి సంప్రదించాలని నాగిరెడ్డి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.

## జాతియస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరుఎంపిక

గన్నవరం():జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఛాంప్ కి గన్నవరం విద్యార్థులు రెహాన్, కీర్తి శ్రీ లు ఎంపికజాతీయ స్థాయి యస్. జి.యఫ్ అండర్ 19 ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ కు ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కృష్ణా జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వి. రవి కాంత శుక్రవారంతెలిపారు. ఇటీవల నంద్యాల లో జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఫెన్సింగ్ అండర్ 19 పోటీలలో అసమాన క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన ఏ రెహాన్ ఇప్పి విభాగం లో పి. కీర్తి శ్రీ ఫోయిల్ విభాగంలో కృష్ణా జిల్లా నుండి పాల్గొన్న వీరు ఈ నెల 10 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు పాట్నా లో జరుగబోయే జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిద్యం వహిస్తారని చెప్పారు.జట్టు శనివారం 7 వ తేదీ విజయవాడ నుండి బయలు దేరి పాట్నా వెళుతున్నట్లు తెలియజేశారు.. చక్కటి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రెహాన్,

శుభోదయం

## సంపాదకీయం

# చెదిరిన డాలర్ డ్రీమ్స్

## (విశ్లేషణ)

అక్రమ వలసల్ని సహించేది లేదనీ, అక్రమ వలసదారుల్ని అమెరికా నుంచి వెనక్కి పంపేవరకు నిద్రపోయేది లేదనీ చెబుతూ వస్తున్న అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు చేతల్లోకి దిగారు. సరైన పత్రాలు లేకుండా తమ దేశంలో ఉంటున్న భారత్‌కు చెందిన అక్రమ వలసదారుల్లో కొందరిని తొలి విడతగా వెనక్కి పంపేశారు. అమెరికాలోని టెక్సాస్‌లో శాన్ ఆంటోనియో నుంచి బయలు అమెరికన్ యుద్ధవిమానం బుధవారం మధ్యాహ్నం మన అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగడంతో కొత్త అంకం ఆరంభమైంది. ఆ ఖరీదైన సీ%-%17 అమెరికా యుద్ధ విమానం నుంచి 104 మంది భారతీయ అక్రమ వలసదారులు వెనక్కి వచ్చినట్టు కథనం. వచ్చిన వారి పత్రాలనూ పరిశీలించి, ప్రాథమికంగా ప్రశ్నించి, వైద్యపరీక్షలు సైతం చేసి, ఎలాంటి నేర చరిత్రా లేదని నిర్ధరించుకున్నాక వారిని స్వరాష్ట్రాలకు పంపే పనిలో భారత పాలనా యంత్రాంగం నిమగ్నమైంది. గడచిన బైడెన్ హయాంలో 2024లో అమెరికాతో మన సంబంధాలు కొంత అడుగంటాక, తాజా ట్రంప్ ఏలుబడిలో వాటిని మళ్ళీ బలోపేతం చేసుకోవాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ అక్రమ వలసల అంశం కొంత చీకాకు పరిచేదే అయినా, అనివార్యతల్ని గ్రహించి, సహనంతో సమస్యల్ని చక్కదిద్దుకోవడమే భారత్ ముందున్న మార్గం. పత్రాలు లేకుండా ఉంటున్నవారిని సహించేది లేదని హెచ్చరిస్తూ వచ్చిన ట్రంప్ జనవరి 20న అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అలాంటివారిని ఏరి ఏరి మరీ భారత్‌కు వెనక్కు పంపడం ఇది తొలిసారి. గతంలో, గ్వాటెమలా, పెరూ, హోండూరస్‌ల నుంచి చట్టవిరుద్ధంగా వలస వచ్చినవారిని తిరుగు టపాలో పంపేందుకు అమెరికా సైనిక విమానాన్ని వినియోగించింది. ఇప్పుడు మన విషయంలోనూ అదే చేసింది. వెనక్కి పంపేందుకు సిద్ధం చేసిన 15 లక్షల మంది జాబితాలో భారతీయులు 18 వేల మంది దాకా ఉన్నారట. అంటే, రానున్న నెలల్లో ఇలాంటి మరిన్ని విమానాల్లో వందల సంఖ్యలో మనవాళ్ళు వెనక్కి రానున్నారన్నది చేదు నిజం. అంటే, ఎంత స్నేహమున్నా అసలు సంగతికొచ్చే సరికి అగ్ర రాజ్యాధినేత భారత్‌తోనూ ముక్కుసూటిగానే ఉంటారన్నది సుస్పష్టం. నిజానికి, మెక్సికో, ఎల్‌సాల్వడార్‌ల తర్వాత అమెరికాలో అక్రమ వలసదారుల్లో అధిక సంఖ్యాకులు భారతీయులే. అక్కడ అలాంటి భారతీయుల సంఖ్య దాదాపు 7.25 లక్షలని ఓ లెక్క. తాజాగా వెనక్కివచ్చినవారిలో పంజాబ్ (30 మంది), హరియాణా (33), గుజరాత్ (33), తదితర రాష్ట్రాల వారున్నారు. వీరిలో పిల్లలు, మహిళలు కూడా ఉండడం గమనార్హం. ఆ మాటకొస్తే, అమె రికా ఇలా అక్రమ వలసదారులైన భారతీయుల్ని వెనక్కిపంపడం కొత్తేమీ కాదు. గత అక్టోబర్‌లోనూ వంద మంది పంజాబ్‌కు తిరిగొచ్చారు. 2023 అక్టోబర్ నుంచి నిరుడు సెప్టెంబర్ ఆఖరు వరకు మొత్తం 1100 మంది ఇలా ఇంటి ముఖం పట్టినవారే! అగ్రరాజ్యాన్ని కలలస్వర్గంగా ఊహించుకుంటూ, అక్కడ జీవనం బాగుంటుందనే ఆశతో, డాలర్ల సంపాదనపై ఆకర్షణతో అక్కడకు సక్రమంగానో, అవసరమైతే అక్రమంగానో వెళ్ళి, స్థిరపడాలనే ధోరణి చాలాకాలంగా ఉన్నదే. ఒక లెక్క ప్రకారం ప్రపంచపు పెద్దన్న పంచన చట్టప్రకారమే దాదాపు 50 లక్షల మంది భారత జాతీయు లున్నారంటే మన అమెరికా మోజు ఎంతో అర్థం చేసుకోవచ్చు. దీర్ఘకాలంగా మన భారతీయుల్లో అంతకంతకూ అధికమవుతూ వచ్చిన ఆ మోజు ఫలితమే %-% అధికసంఖ్యలోని అక్రమ వలసలు. ముఖ్యంగా, పంజాబ్ లాంటి ప్రాంతాల నుంచి అలా వెళ్ళేవారు మరీ ఎక్కువ. స్థానిక పంజాబీ జాతీయంలో చెప్పాలంటే 'డాంకీ రూట్స్'లో (వాహనాలు మారుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ) అమెరికా చేరుకుంటారు. విదేశాల్లో బతుకు తెరువుకై తపిస్తున్న వ్యక్తుల ఆశల్ని సొమ్ము చేసుకుంటూ, ట్రావెల్ ఏజెన్సీలు భారీగా లక్షల్లో డబ్బు గుంజి, దొంగ వీసాలతో వారిని ఇలా దేశాల హద్దుల్ని దాటిస్తుంటాయి. సగటున ఏటా 90 వేల పైచిలుకు భారతీయులు ఇలా అక్రమంగా అమెరికాలో ప్రవేశించబోయి, పట్టుబడుతున్నారు. తల తాకట్టుపెట్టి, సరైన పత్రాలు లేకుండానే అందరి కళ్ళుగప్పి అలా హద్దులు దాటి వెళ్ళిన పలువురికి ఇప్పుడు కల చెదిరింది. ట్రంప్ రాకతో వారి కథ మారింది. చాలామందికి కన్నీరే మిగిలింది. తగిన పత్రాలు లేకుండా అమెరికాలోనే కాదు, ఏ దేశంలోనైనా ఏ జాతీయులు నివసించినా అది తప్పే. శిక్షార్హమైన నేరమే. ఇంతకాలం చూసీచూడనట్టు చెల్లిపోయినా, అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానంటూ ఇప్పుడు రెండోసారి పగ్గాలు చేపట్టిన ట్రంప్ ఖడ్గప్రహారం చేయడాన్ని తప్పుపట్టలేం. అందుకే, బాధితులు భారతీయులైనా మన దేశం మారుమాట్లాడ లేకపోతోంది. ఆ మాటకొస్తే, వ్యవస్థీకృత నేరాలకు దారి తీస్తున్నట్లు భావిస్తున్న అక్రమ వలసలకు భారత్ వ్యతిరేక మని మన విదేశాంగ శాఖ నొక్కి వక్కాణించాల్సి వచ్చింది. అదే సమయంలో భారతీయుల పునరాగమనానికి వీలు కల్పిస్తామనీ చెప్పాల్సి వచ్చింది. వాణిజ్య సుంకాల విధింపు సహా అనేక విష యాల్లో ట్రంప్ దూకుడు మీదున్న తరుణంలో అమెరికాతో దీర్ఘకాలిక స్నేహసంబంధాలకు ఇబ్బంది కలగకుండా మన దేశం ఆచితూచి వ్యవహరించక తప్పదు. ఆ కోణం నుంబ్బంది కలగకుండా మన దేశం ఆచితూచి వ్యవహరించక తప్పదు. ఆ కోణం చి చూసినప్పుడు భారత్ వైఖరి సమంజసమే కాదు సహజం కూడా! అయితే, ఈ అక్రమ వలసల్ని ఆపాలంటే, అమాయకుల ఆశను సొమ్ము చేసుకొనే అక్రమార్కుల పనిపట్టాలి. అంతకన్నా ముఖ్యంగా, ఆశల పల్లకీలో అగ్రరాజ్యం వైపు ఉరికే మనవాళ్ళకు గౌరవప్రదమైన ఉపాధి, ఉద్యోగావకాశాలిక్కడే కల్పించడంపై పాలకులు దృష్టిపెట్టాలి. చిత్తశుద్ధితో అది చేయనంతకాలం ఈ డాలర్‌డ్రీమ్స్ కథలు కంచికి చేరవు!

# స్వామీ అంటూ జగన్ మీద లోకేష్ సెటైర్లు

ఏపీ మాజీ సీఎం వర్సెస్ నారా లోకేష్ గా లేటెస్ట్ పాలిటిక్స్ టర్న్ తీసుకుంటోంది. జగన్ లండన్ నుంచి వస్తూనే తాడేపల్లి కేంద్రంగా పార్టీ నేతలతో వరస భేటీలు పెడుతున్నారు. అదే సమయంలో ఆయన తనలోని పాత ఫైర్ ని గుర్తుకు తెచ్చేలా హీటెత్తించే స్టేట్మెంట్స్ ఇస్తున్నారు. / తనలో వన్ పాయింట్ ఓ ని గతంలో చూసారని ఇపుడు టూ పాయింట్ ఓ గా ముందుకు వస్తాను అని జగన్ పార్టీ మీటింగులో వేడెక్కించే స్టేట్మెంట్ ఇచ్చారు. తమ పార్టీ వారిని కూటమి నేతలు ఏమీ చేయలేరని జగన్ అన్నారు. వైసీపీ కార్యకర్త వెంట్రుక సైతం పీకలేరని ఆయన ఆవేశభరితమైన ప్రకటనలే చేశారు. దీనికి ఢిల్లీ టూర్ లో ఉన్న లోకేష్ ధీటైన కౌంటర్ ఇచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వన్ పాయింట్ ఓ పాలనతోనే విసిగి వేసారి జనాలు ఉన్నారు స్వామీ అని జగన్ మీద సెటైర్లు వేశారు. వైసీపీ అయిదేళ్ళ పాలనను ఎవరూ మరచిపోలేదని అన్నారు వైసీపీ హయాంలో దళితుల నుంచి బీసీల నుంచి అన్ని వర్గాలు ఎంతో ఇబ్బంది పడ్డాయని అన్నారు. తన మీదనే ఏకంగా 23 కేసులు పెట్టారని ఆయన చెప్పారు. తన పార్టీ నాయకులు అందరి మీద కేసులు ఉన్నాయని అన్నారు. ఏపీలో అయిదేళ్ళ కాలంలో మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేశారని ఆయన విమర్శించారు.

బయటకు వెళ్ళకుండా తమ ఇంటికే తాళ్ళు కట్టి నిర్భందించారని దానిని ఎవరు మరచిపోతారని అన్నారు. తాము వైసీపీ నేతల తప్పులను రూల్స్ ప్రకారమే చట్టం ముందు ఉంచి శిక్షిస్తామని రెడ్ బుక్ గురించి జనంలో చెప్పామని అన్నారు. ఏపీలో అయిదేళ్ళ వైసీపీ పాలనలో పెట్టుబడులు ఏమి వచ్చాయని ఆయన నిలదీశారు. తమ ఎనిమిది నెలల పాలన వైసీపీ అయిదేళ్ళ పాలన మీద చర్చకు జగన్ సిద్ధమా అని ప్రశ్నించారు. జగన్ తనతో డిబేట్ కి వస్తే తాము ఏమేమి పెట్టుబడులు తెచ్చామో వివరిస్తామని అన్నారు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెట్టుబడిదారులను ఏపీ నుంచి తరిమేశారని అన్నారు. అమర్ రాజా కంపెనీ సహా అనేక సంస్థలు అలా వెళ్ళిపోయినవే అన్నారు. ఈ రోజుకు కూడా పారిశ్రామికవేత్తలు ఏపీ అంటే భయపడే పరిస్థితి ఉందని అన్నారు. జగన్ మళ్ళీ వస్తే సంగతేంటి అని వారు అడుగుతున్నారని తాము అలా ఎప్పటికీ జరగదని చెబుతున్నామని అన్నారు. ఏపీ ఇమేజ్ ని తిరిగి తెస్తున్నామని నష్టపోయిన ఏపీని దారిన పెడుతున్నామని అన్నారు. జగన్



తన పాలన గురించి మరచిపోయి టూ పాయింట్ ఓ అని చెప్పడాన్ని లోకేష్ తప్పు పట్టారు. ఇక జగన్ అసెంబ్లీకి వచ్చి పులివెందుల సమస్యలు మాట్లాడాలని కోరారు. ప్రజలు జగన్ కి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని వారే గుర్తించకపోతే తామేమి చేస్తామని లోకేష్ అన్నారు. జగన్ సీఎం గా ఉన్నపుడు ఒక నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలను లాగేస్తే టీడీపీకి విపక్ష హోదా ఉండదని చెప్పిన మాటను మరచారా అని నిలదీశారు. మరి ఆయనకు ఆనాడు ఇదే రూల్ వర్తిస్తుందని తెలిసినపుడు ఇపుడు ఎలా విపక్ష హోదాహోదా అడుగుతారని లోకేష్ అన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఎవరికి పీకి పక్కన పెట్టారో అర్ధమైనా ఇంకా ఏమీ చేయలేరని మాట్లాడితే ఎలా అని వైసీపీ అధినాయకత్వాన్ని ఎద్దేవా చేశారు. మొత్తానికి చూస్తే జగన్ తో ముఖాముఖీకి రెడీ అని లోకేష్ అంటున్నారు. మరి తన హయాంలో ఎన్ని పెట్టుబడులు తెచ్చామో కూడా చెబుతామని అంటున్నారు. జగన్ రెడీనా అని సవాల్ చేస్తున్నారు. మరి వైసీపీ అధినేత ఈ సవాల్ మీద ఏమంటారో చూడాల్సి ఉంది.

# చికెన్ ప్రియులకు బ్యాడ్ న్యూస్.. కోళ్లకు కొత్త రోగం.. వామ్మో.. తిరుగుతూనే ఉన్నట్టుండి..

ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ.. అటు ఉభయగోదావరి జిల్లాలతో పాటు.. ఇటు ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో అంతుచిక్కని వైరస్ పౌల్ట్రీ పరిశ్రమను వణికిస్తోంది. అప్పటివరకు ఆరోగ్యంగా కనిపించిన కోడి అంతలోనే మృత్యువాత పడుతుండటం పౌల్ట్రీ నిర్వాహకులను కలవరపెడుతోంది. సాధారణ మరణాలకు భిన్నంగా వేలాది కోళ్లు చనిపోతుండటం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అంతుచిక్కని వైరస్ చాపకింద నీరులా పౌల్ట్రీలకు విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పౌల్ట్రీ ఫారాల దగ్గర చనిపోయిన కోళ్లు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఒక్కో ఫారంలో రోజుకు సుమారు పదివేల కోళ్లు చనిపోతున్నాయని చెబుతున్నారు నిర్వాహకులు. అయితే ఈ కోళ్ల మృతికి కారణం ఏంటన్నది గుర్తించలేకపోతున్నారు..యజమానులు. కోళ్ల మృతితో కోడిగుడ్ల ఎగుమతులు భారీగా తగ్గిపోయాయి. ఇక్కడి నుంచి నిత్యం పశ్చిమ బెంగాల్, అస్సా రాష్ట్రాలకు నిత్యం 40కి పైగా లారీల్లో కోడిగుడ్లు ఎగుమతి అయ్యేవి. అయితే ఆ సంఖ్య ప్రస్తుతం 25కు పడిపోయింది. మరికొన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే ఆ సంఖ్య సింగిల్ డిజిట్‌కు పడిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కోళ్ల మరణాలు ఇలాగే కొనసాగితే భారీ నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..పౌల్ట్రీ యజమానులు.

### 40 లక్షలకు పైగా కోళ్ల మృతి

సాధారణంగా అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో పౌల్ట్రీలోని కోళ్ల సంఖ్యలో రోజుకు 0.05 శాతం లోపు కోళ్లు చనిపోతుంటాయి. లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీలో రోజుకు 20 నుంచి 50 వరకు కోళ్లు చనిపోతుంటే లెక్కలోకి తీసుకోరు. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. ఒక్క ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే గడిచిన 15 రోజుల్లో 40 లక్షల కోళ్లు చనిపోయాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ఈ కోళ్ల మరణాలకు కారణమైన వైరస్‌ను గుర్తించి..దాని నిర్మూలనకు సహకరించాలని ప్రభుత్వాన్నికోరుతున్నారు..రైతులు.ఇక తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో వేలాది బాయిలర్ కోళ్లు చనిపోతున్నాయి. అంతుచిక్కని వైరస్‌తో సత్తుపల్లి, కల్లూరు, విఎమ్ బంజరలోని పౌల్ట్రీ ఫామ్స్‌లో కోళ్లు మృతి చెందాయి. కోళ్ల మృతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. బిర్కూర్, పోతంగల్, భీమ్‌గల్ మండలాల్లో వేలాది కోడి పిల్లలు చనిపోయాయి. వైరస్ ఒక్కొక్కటిగా.. అన్ని పౌల్ట్రీ ఫామ్స్‌కు వ్యాపిస్తుండటంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వైరస్ ఏంటో కనిపెట్టి..దానికి సంబంధించిన వ్యాక్సిన్ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### ఉన్న కోళ్లను వచ్చిన ధరకు అమ్ముకుంటున్న రైతులు

సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువై కోళ్లకు ఊపిరితిత్తుల సంబంధిత వైరస్‌లు వ్యాపిస్తుంటాయి. అయితే





శీతాకాలంలో వచ్చే వ్యాధులకు భిన్నంగా ఈ వైరస్ లక్షణాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. తెల్లారేసరికి ఎన్ని కోళ్లు ఉంటాయో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఒక్క కోడికి వైరస్ సోకిందంటే చాలు.. సాయంత్రానికి ఆ షెడ్డులో ఉన్న వేలాది కోళ్లు ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో వైరస్ వచ్చి చనిపోతాయేమో అనే భయంతో..బతికి ఉన్న కోళ్లను వచ్చిన ధరకు అమ్మేసుకుంటున్నారు రైతులు.

శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించిన అధికారులు

మరోవైపు కోళ్ల అంతుచిక్కని మరణాలకు కారణాలేంటో తెలుసుకునే పనిలో పడ్డారు అధికారులు. పౌల్ట్రీ పార్మ్స్‌లో ఇప్పటికే శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కి పంపామని అధికారులు చెబుతున్నారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత కోళ్లకు సోకుతున్న వ్యాధి ఏంటో తెలుస్తుందంటున్నారు. అయితే మరిన్ని కోళ్లకు వైరస్ సోకకుండా రైతులు..చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశంలో పడేయకుండా పాతిపెట్టాలని సూచిస్తున్నారు.

### ఆరోగ్యంగా తిరుగుతూ ఉన్నట్టుండి మృతి

ఈ మరణాలకు %ఎ5చీ%1 అనే వైరస్ కారణం కావొచ్చని అనుమానిస్తున్నారు.. పశు సంవర్ధకశాఖ అధికారులు. 2012, 2020లో కూడా ఇదే తరహాలో వైరస్ వ్యాపించింది. నాలుగేళ్ల క్రితం ఈ వ్యాధి సోకిన అనేక కోళ్లు మృత్యువాతపడ్డాయి. అప్పుడు కోళ్లు ఎందుకు చనిపోతున్నాయో కూడా తెలియని అయోమయం నెలకొంది. వైరస్ సోకి కోళ్లు మరణిస్తున్నాయనే వార్త బయటకు రాగానే అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. అప్పుడు వైరస్ సోకడానికి చాలా రోజుల సమయం పట్టింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా వైరస్ వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వైరస్ సోకిన కోడికి లక్షణాలు కనిపించవు. ఎప్పటిలాగే ఆరోగ్యంగా తిరుగుతున్నట్టే కనిపించి.. ఉన్నట్టుండి చనిపోతుంది. అధికారుల సూచనలతో ఇప్పటికే కోళ్లపై వైరస్ ప్రభావం తగ్గేందుకు మందులు ఇస్తున్నారు. ఇక కొల్లేరు ప్రాంతానికి ఈ సారి అధిక సంఖ్యలో వలస పక్షులు రావడం కూడా వైరస్ వ్యాప్తికి కారణమై ఉండొచ్చన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైరస్ ప్రభావం కోళ్లపై పడకుండా ఉండేందుకు వాటికి చిన్నప్పటి నుంచే వ్యాక్సిన్లు అందించాలని సూచిస్తున్నారు..నిపుణులు.

20 వారాల వయసు వచ్చేసరికి 23 రకాల వ్యాక్సిన్లు

కొద్దిరోజుల క్రితం నాటు కోళ్లలో కనిపించిన వింత లక్షణాలు ఇప్పుడు లేయర్, బ్రాయిలర్ కోళ్లకు వ్యాపించాయి. నాటు కోళ్లతో పోలిస్తే లేయర్ కోళ్లకు వ్యాక్సినేషన్ విషయంలో పౌల్ట్రీ వర్గాలు చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి. కోడికి 20 వారాల వయసు వచ్చేనాటికి దాదాపు 23 వరకు వ్యాక్సిన్లు వేస్తారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా కోళ్లు అంతుచిక్కని లక్షణాలతో మృత్యువాత పడుతుండటం పౌల్ట్రీ వర్గాలను కలవరపరుస్తోంది. ఈ కోళ్ల మరణాలను నియంత్రించకపోతే.. రాబోయే రోజుల్లో పౌల్ట్రీ ఫారాల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

# లిక్కర్ అక్రమాలపై ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం.. లెక్క తేలాల్సిందే..!

ఆంధ్రప్రదేశ్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయంలోని మద్యం అక్రమాలపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులతో సిట్ వేయడం ఆసక్తి రేపుతోంది. ఇంతకీ.. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లో ఎవరెవరు ఉన్నారు?.. సిట్‌కు కూటమి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇచ్చింది? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ రాజకీయాల్లో హీట్ ఏమాత్రం తగ్గడం లేదు. అధికార, ప్రతిపక్షాల విమర్శలు, ప్రతివిమర్శలతో పాలిటిక్స్ కాకరేపుతున్నాయి. మరోవైపు.. కూటమి ప్రభుత్వ వరుస నిర్ణయాలతోనూ మరింత ఏపీ వేడెక్కుతోంది. తాజాగా.. వైసీపీ హయాంలోని మద్యం అక్రమాలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా విజయవాడ సీపీ రాజశేఖరబాబును నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సిట్ సభ్యులుగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బారాయుడు, అడిషనల్ ఎస్పీలు కొల్లి శ్రీనివాస్, శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు శివాజీ, నాగశ్రీనివాస్‌ను నియమించింది. దానిలో భాగంగా.. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు జరిగిన మద్యం అక్రమాలపై ఎంక్వైరీ చేయాలని ఏడుగురు సభ్యుల సిట్ బృందానికి ఆదేశాలు ఇచ్చింది. సిట్ దర్యాప్తుకు అన్ని రకాల అధికారాలు కల్పించిన ఏపీ ప్రభుత్వం.. రికార్డులు సీజ్ చేసేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక.. జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్‌లో జరిగిన అవకతవకలపై




గతంలోనే ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోంది. అయితే.. ఈ దర్యాప్తును మరింత స్పీడ్ పెంచేందుకు సిట్‌ను నియమించాలని ఏపీ ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదనలు పంపారు. దాంతో.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దీనికి సంబంధించి సిట్ అధికారులు అడిగిన నివేదికను ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే.. ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు పురోగతిపై విచారణ నివేదిక ఇవ్వాలని కూడా సిట్‌ను ఆదేశించింది. సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలోనే సిట్ పనిచేస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గత ప్రభుత్వంలో ఏపీలోని మద్యం విక్రయాల్లో వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగినట్లు అభియోగాలు ఉన్నాయి. నగదు లావాదేవీలతో పాటు హోలో గ్రామ్‌ల వ్యవహారంలోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే.. లిక్కర్ అక్రమాలపై సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి. సీఐడీ డీజీ ద్వారా రిపోర్ట్ సమర్పించాలని ఏపీ ప్రభుత్వం సిట్‌ను ఆదేశించింది.

## ఎలక్షన్ కమిషన్ చచ్చిపోయింది.. బహుమతిగా తెల్లటి వస్త్రాన్ని బహుమతిగా ఇవ్వాలి



న్యూఢిల్లీ : బుధవారం ఉత్తరప్రదేశ్‌లో మిల్కిపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నిక పోలింగ్ సమయంలో బిజెపి పార్టీకే ఎక్కువ ఓట్లు పడేందుకు, పరోక్షంగా బిజెపి నేతల గెలుపుకు పోలీసులు ప్రయత్నించారు. పోలింగ్ బూత్‌ల వెలుపల పోలీసులు ఓటరు ఐడి కార్డుల్ని బలవంతంగా చూసి.. అధికార పార్టీకే ఓటు వేయాలని వారిని బెదిరించారు. ఈ వ్యవహారంపై ఎస్‌పి పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదు. దీంతో ఎన్నికల సంఘం తీరుపై అఖిలేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎలక్షన్ కమిషన్ చచ్చిపోయిందని ఆయన ఆరోపించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఓటర్లను భయపెట్టి.. బెదిరించి ఓట్లు వేయించుకోవడం బిజెపి పద్ధతి. గత కొన్నేళ్లుగా బిజెపి అనుసరిస్తున్న విధానమే ఇది. బిజెపి తీరును ఎన్నికల సంఘం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుంది. మిల్కిపూర్ ఉప ఎన్నిక సమయంలో కూడా బిజెపి ఇదే విధానాన్ని అనుసరించింది. అప్పుడు ఎన్నికల సంఘం అచేతనమైపోయింది. ఓరకంగా ఇసి చచ్చిపోయింది. శవంపై కప్పడానికి మేము తెల్లటి వస్త్రాన్ని బహుమతిగా ఇవ్వాలి' అని ఆయన అన్నారు.

## త్వరలో హెచ్-1బి వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ రద్దు?

### రిపబ్లికన్ల తీర్మానం ఆమోదిస్తే భారతీయులపై తీవ్ర ప్రభావం




వాషింగ్టన్ : హెచ్-1బి, ఎల్ 1 వంటి వర్క్ వీసాల పొడిగింపును ట్రంప్ సర్కార్ త్వరలో రద్దు చేసే అవకాశం వుంది. అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం కల్పించే ఈ వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ కాలాన్ని అప్పటికి వున్న 180 రోజుల నుండి 540 రోజులకు పెంచుతూ బైడెన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ రిపబ్లికన్ సెనెటర్లు జాన్ కెన్నడీ, రిక్ స్కాట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇమ్మి గ్రేషన్‌పై, కఠినమైన వర్క్ వీసా నిబంధనలపై ట్రంప్ సర్కార్ తీవ్రమైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బైడెన్ కాలం నాటి ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని సెనెటర్లు కోరారు. వీసాల పొడిగింపును ట్రంప్ రద్దు చేస్తే అత్యధిక ప్రభావం భారతీయులపై పడుతుంది. అమెరికాలో 3,86,000మందికి హెచ్-1బి వీసాలు జారీ చేయగా, వారిలో 72.3శాతం మంది భారతీయులే. 2022లో ఈ సంఖ్య 77శాతంగా వుంది. 2024లో అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డులు తీసుకున్న రెండో అతిపెద్ద గ్రూపు భారతీయులే. వీరి సంఖ్య 49,700గా వుంది.

## అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి ఇయుతో కలిసి పనిచేస్తాం



బీజింగ్ : అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో యూరోపియన్ యూనియన్(ఇయు)తో కలిసి పనిచేసేందుకు సుముఖంగా వున్నట్లు చైనా పేర్కొంది. సహకారాన్ని పెంచుకునేందుకు ఇయు విశ్వసనీయమైన భాగస్వామిగా మారుతుందని ఆశిస్తున్నామని, దానితో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బుధవారం పేర్కొన్నారు. ఇప్పటికే చైనా, కెనడా, మెక్సికో దేశాల దిగుమతులపై అదనపు సుంకాలు విధించిన ట్రంప్ ఇయు ఉత్పత్తులపై కూడా విధించే అవకాశాలు వున్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాలని భావిస్తున్నట్లు ఇయు వాణిజ్య చీఫ్ మంగళవారం తెలిపారు. ట్రంప్‌తో యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ జరపబోయే చర్చలేవీ అంత సాఫీగా జరగకపోవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులతో ఇయు సంబంధాలు కొంతమేర దెబ్బతింటున్న పరిస్థితుల్లో బీజింగ్, బ్రస్సెల్స్ మధ్య సంబంధాలపై పునరాలోచన చేయాలని ఉర్సులా వాన్ డెర్ లేయన్ వంటి వారు యోచిస్తున్నారు. రష్యాతో చైనా సంబంధాలు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఇయు, చైనా సంబంధాలు ఇబ్బందుల్లో పడ్డాయి. మంగళవారం బ్రస్సెల్స్‌లో లేయన్ మాట్లాడుతూ, చైనాతో సంబంధాల్లో ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికే ఇయు చూస్తుందని చెప్పారు. వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలను విస్తరించుకోవడానికి, ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కూడా అవకాశాలు వున్నాయన్నారు. ఆ ఒప్పందాలు ఏమిటన్న వివరాలు ఆమె వెల్లడించలేదు. గతేడాది అక్టోబరులో చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై అప్పటికే వున్న సుంకాలకు అదనంగా ఇయు మరో 10శాతం సుంకాలు విధించింది. ఈ చర్యకు బీజింగ్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దీంతో బ్రాందీ వంటి కొన్ని ఇయు ఉత్పత్తులు చైనా మార్కెట్‌లో ప్రవేశించడానికి అడ్డంకులను చైనా పెంచింది.

## ప్రజల కళ్లకు గంతలు కట్టి అధికారాన్ని కాపాడుకున్నారు..




### కాంగ్రెస్ పై ప్రధాని ఫైర్

సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. ప్రజల కళ్లకు గంతలు కట్టి తమ అధికారాన్ని కాపాడుకున్నారని ప్రధాని మోడీ అన్నారు. ఆ కాలంలో మరో విధానం గురించి ఆలోచించిన పరిస్థితి లేదని.. బుజ్జగింపు రాజకీయాలకే కాంగ్రెస్ నాయకులు ప్రాధాన్యం ఇచ్చారని మండిపడ్డారు. గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా రాజ్యసభలో ప్రధాని ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్‌లో కాంగ్రెస్‌కు ఇబ్బంది ఏంటో అర్థంకావడం లేదన్నారు. దేశ ప్రజలందరికి సేవ చేసేందుకు మనం ఇక్కడున్నామని.. కానీ, ఫ్యామిలీ ఫస్ట్ అన్నదే కాంగ్రెస్ విధానమని.. నేషన్ ఫస్ట్ అనేది మా విధానమని చెప్పారు. "మూడోసారి దేశ ప్రజలు మాకు అవకాశం ఇచ్చారు. ఇంతపెద్ద దేశంలో మాకు మూడోసారి అవకశం దక్కిదంటే మా అభివృద్ధిని ప్రజలు అర్థం చేసుకున్నారు. మా డెవలప్‌మెంట్ మోడల్‌ను సమర్థించారు. మా హయాంలో సమయమంతా దేశ ప్రజల ప్రగతి కోసం వినియోగిస్తున్నాం.కేవలం అర్హులకే లబ్ధి చేకూరేలా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాం. పదేళ్లలో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్పును గమనిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేస్తున్నాం. ఓబీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇవ్వలేదు. మేం వచ్చాక ఓబీసీల డిమాండ్‌ను నెరవేర్చాం. దేశంలో దివ్యాంగుల గురించి మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నాం. దివ్యాంగుల కోసం ఎన్నో రకాల పథకాలు చేపట్టాం. ట్రాన్స్‌జండర్స్ గౌరవంతో బతికేలా చర్యలు తీసుకున్నాం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.


# చెదిరిన డాలర్ డ్రీమ్స్






అక్రమ వలసల్ని సహించేది లేదనీ, అక్రమ వలసదారుల్ని అమెరికా నుంచి వెనక్కి పంపేవరకు నిద్రపోయేది లేదనీ చెబుతూ వస్తున్న అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు చేతల్లోకి దిగారు. సరైన పత్రాలు లేకుండా తమ దేశంలో ఉంటున్న భారత్‌కు చెందిన అక్రమ వలసదారుల్లో కొందరిని తొలి విడతగా వెనక్కి పంపేశారు. అమెరికాలోని టెక్సాస్‌లో శాన్ ఆంటోనియో నుంచి బయలు అమెరికన్ యుద్ధవిమానం బుధవారం మధ్యాహ్నం మన అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగడంతో కొత్త అంకం ఆరంభమైంది. ఆ ఖరీదైన సీ-17 అమెరికా యుద్ధ విమానం నుంచి 104 మంది భారతీయ అక్రమ వలసదారులు వెనక్కి వచ్చినట్టు కథనం. వచ్చిన వారి పత్రాలనూ పరిశీలించి, ప్రాథమికంగా ప్రశ్నించి, వైద్యపరీక్షలు సైతం చేసి, ఎలాంటి నేర చరిత్రా లేదని నిర్ధరించుకున్నాక వారిని స్వరాష్ట్రాలకు పంపే పనిలో భారత పాలనా యంత్రాంగం నిమగ్నమైంది. గడచిన బైడెన్ హయాంలో 2024లో అమెరికాతో మన సంబంధాలు కొంత అడుగంటాక, తాజా ట్రంప్ ఏలుబడిలో వాటిని మళ్ళీ బలోపేతం చేసుకోవాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ అక్రమ వలసల అంశం కొంత చీకాకు పరిచేదే అయినా, అనివార్యతల్ని గ్రహించి, సహనంతో సమస్యల్ని చక్కదిద్దుకోవడమే భారత్ ముందున్న మార్గం. పత్రాలు లేకుండా ఉంటున్నవారిని సహించేది లేదని హెచ్చరిస్తూ వచ్చిన ట్రంప్ జనవరి 20న అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అలాంటివారిని ఏరి ఏరి మరీ భారత్‌కు వెనక్కు పంపడం ఇది తొలిసారి. గతంలో, గ్వాటెమలా, పెరూ, హోండూరస్‌ల నుంచి చట్టవిరుద్ధంగా వలస వచ్చినవారిని తిరుగు టపాలో పంపేందుకు అమెరికా సైనిక విమానాన్ని వినియోగించింది. ఇప్పుడు మన విషయంలోనూ అదే చేసింది. వెనక్కి పంపేందుకు సిద్ధం చేసిన 15 లక్షల మంది జాబితాలో భారతీయులు 18 వేల మంది దాకా ఉన్నారట. అంటే, రానున్న నెలల్లో ఇలాంటి మరిన్ని విమానాల్లో వందల సంఖ్యలో మనవాళ్ళు వెనక్కి రానున్నారన్నది చేదు నిజం. అంటే, ఎంత స్నేహమున్నా అసలు సంగతికొచ్చే సరికి అగ్ర రాజ్యాధినేత భారత్‌తోనూ ముక్కుసూటిగానే ఉంటారన్నది సుస్పష్టం. నిజానికి, మెక్సికో, ఎల్‌సాల్వడార్‌ల తర్వాత అమెరికాలో అక్రమ వలసదారుల్లో అధిక సంఖ్యాకులు భారతీయులే. అక్కడ అలాంటి భారతీయుల సంఖ్య దాదాపు 7.25 లక్షలని ఓ లెక్క. తాజాగా వెనక్కివచ్చినవారిలో పంజాబ్ (30 మంది), హరియాణా (33), గుజరాత్ (33), తదితర రాష్ట్రాల వారున్నారు. వీరిలో పిల్లలు, మహిళలు కూడా ఉండడం గమనార్హం. ఆ మాటకొస్తే, అమె రికా ఇలా అక్రమ వలసదారులైన భారతీయుల్ని వెనక్కిపంపడం కొత్తేమీ కాదు. గత అక్టోబర్‌లోనూ వంద మంది పంజాబ్‌కు తిరిగొచ్చారు. 2023 అక్టోబర్ నుంచి నిరుడు సెప్టెంబర్ ఆఖరు వరకు మొత్తం 1100 మంది ఇలా ఇంటి ముఖం పట్టినవారే! అగ్రరాజ్యాన్ని కలలస్వర్గంగా ఊహించుకుంటూ, అక్కడ జీవనం బాగుంటుందనే ఆశతో, డాలర్ల సంపాదనపై ఆకర్షణతో అక్కడకు సక్రమంగానో, అవసరమైతే అక్రమంగానో వెళ్ళి, స్థిరపడాలనే ధోరణి చాలాకాలంగా ఉన్నదే. ఒక లెక్క ప్రకారం ప్రపంచపు పెద్దన్న పంచన చట్టప్రకారమే దాదాపు 50 లక్షల మంది భారత జాతీయు లున్నారంటే మన అమెరికా మోజు ఎంతో అర్థం చేసుకోవచ్చు. దీర్ఘకాలంగా మన భారతీయుల్లో అంతకంతకూ అధికమవుతూ వచ్చిన ఆ మోజు ఫలితమే - అధికసంఖ్యలోని అక్రమ వలసలు. ముఖ్యంగా, పంజాబ్ లాంటి ప్రాంతాల నుంచి అలా వెళ్ళేవారు మరీ ఎక్కువ. స్థానిక పంజాబీ జాతీయంలో చెప్పాలంటే 'డాంకీ రూట్స్'లో (వాహనాలు మారుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ) అమెరికా చేరుకుంటారు. విదేశాల్లో బతుకు తెరువుకై తపిస్తున్న వ్యక్తుల ఆశల్ని సొమ్ము చేసుకుంటూ, ట్రావెల్ ఏజెన్సీలు భారీగా లక్షల్లో డబ్బు గుంజి, దొంగ వీసాలతో వారిని ఇలా దేశాల హద్దుల్ని దాటిస్తుంటాయి. సగటున ఏటా 90 వేల పైచిలుకు భారతీయులు ఇలా అక్రమంగా అమెరికాలో ప్రవేశించబోయి, పట్టుబడుతున్నారు. తల తాకట్టుపెట్టి, సరైన పత్రాలు లేకుండానే అందరి కళ్ళుగప్పి అలా హద్దులు దాటి వెళ్ళిన పలువురికి ఇప్పుడు కల చెదిరింది. ట్రంప్ రాకతో వారి కథ మారింది. చాలామందికి కన్నీరే మిగిలింది. తగిన పత్రాలు లేకుండా అమెరికాలోనే కాదు, ఏ దేశంలోనైనా ఏ జాతీయులు నివసించినా అది తప్పే. శిక్షార్హమైన నేరమే. ఇంతకాలం చూసీచూడనట్టు చెల్లిపోయినా, అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానంటూ ఇప్పుడు రెండోసారి పగ్గాలు చేపట్టిన ట్రంప్ ఖడ్గప్రహారం చేయడాన్ని తప్పుపట్టలేం. అందుకే, బాధితులు భారతీయులైనా మన దేశం మారుమాట్లాడ లేకపోతోంది. ఆ మాటకొస్తే, వ్యవస్థీకృత నేరాలకు దారి తీస్తున్నట్లు భావిస్తున్న అక్రమ వలసలకు భారత్ వ్యతిరేక మని మన విదేశాంగ శాఖ నొక్కి వక్కాణించాల్సి వచ్చింది. అదే సమయంలో భారతీయుల పునరా గమనానికి వీలు కల్పిస్తామనీ చెప్పాల్సి వచ్చింది. వాణిజ్య సుంకాల విధింపు సహా అనేక విష యాల్లో ట్రంప్ దూకుడు మీదున్న తరుణంలో అమెరికాతో దీర్ఘకాలిక స్నేహసంబంధాలకు ఇబ్బంది కలగకుండా మన దేశం ఆచితూచి వ్యవహరించక తప్పదు. ఆ కోణం నుంచి చూసినప్పుడు భారత్ వైఖరి సమంజసమే కాదు సహజం కూడా! అయితే, ఈ అక్రమ వలసల్ని ఆపాలంటే, అమాయకుల ఆశను సొమ్ము చేసుకొనే అక్రమార్కుల పనిపట్టాలి. అంతకన్నా ముఖ్యంగా, ఆశల పల్లకీలో అగ్రరాజ్యం వైపు ఉరికే మనవాళ్ళకు గౌరవప్రదమైన ఉపాధి, ఉద్యోగావకాశాలిక్కడే కల్పించడంపై పాలకులు దృష్టిపెట్టాలి. చిత్తశుద్ధితో అది చేయనంతకాలం ఈ డాలర్‌డ్రీమ్స్ కథలు కంచికి చేరవు!

# బీసీ రిజర్వేషన్లు




రాష్ట్ర అసెంబ్లీలో కులగణన నివేదిక ఆమోదం పొందింది. బీసీ రిజర్వేషన్ల తీర్మానాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రకటించారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా అమలుచేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. సర్కారీ సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేకు అసెంబ్లీ గ్రీన్ సిగల్ ఇచ్చిన తరుణంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ అవసరం. తెలంగాణలో చేపట్టిన కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలని సభ డిమాండ్ చేసింది. 'ఎందరో సీఎంలకు ఈ అవకాశం రాలేదు..నాకు వచ్చింది. ఫిబ్రవరి నాలుగును ఇక నుంచి సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తాం' అని సీఎం ప్రకటించారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీ కేంద్ర సర్కారు, దీనికి ఒప్పుకుంటుందా? ఇదొక ప్రశ్న. కాగా అసెంబ్లీలో తీర్మానం చేసి తప్పించుకునే ప్రయత్నం రేవంత్ సర్కారు చేస్తున్నదనే విమర్శలూ వెల్లువెత్తుతు న్నాయి. జనాభా లెక్కలపై అసెంబ్లీలో కేంద్రంలోని మోడీ సర్కారుపై సీఎం నిప్పులు చెరగడం చర్చనీయాంశ మవుతున్నది. 2011 జనాభా లెక్కలు తప్పితే, దేశంలో మరే అధికారిక లెక్కలూ లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు కూడా. 2021లో జనాభా లెక్కలు సేకరించలేదనీ, అది బీసీల హక్కులకు నష్టం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా ఓటరు జాబితాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించాయి. అయితే ఓడిషా ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బీహార్, కర్నాటక రాష్ట్రాలు మాత్రం కులసర్వే చేపట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే కొన్ని ఇస్తున్నాయి. గతంలో లాటరీ పద్ధతిలో, ర్యాండమ్‌గా ఎంపిక చేసే తదితర అశాస్త్రీయ పద్ధతుల్లో రిజర్వేషన్లు అమలుచేస్తుండగా, ప్రతిసారి వాటిపై న్యాయ వివాదాలు తలెత్తడం పరిపాటైంది. ఈ రిజర్వేషన్లు కర్నాటకకు చెందిన కె.కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవిళి కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ట్రిపుల్ 'టీ' పేరిట మార్గదర్శకాలిచ్చింది. మొదటిది ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. రెండోది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి, మూడోది రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తం యాభై శాతం మేరకు మించకూడదు. ఆ మార్గదర్శకాలను పాటించని ఏ రాష్ట్రంలోకూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలుచేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నిబంధనలను పాటించని గుజరాత్, మహారాష్ట్రతోపాటు పలు ర్టాష్టాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దుచేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్‌గా మార్చాలని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. నలభై రెండు శాతం రిజర్వేషన్లను ఉపకులాలవారీగా కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం ఇస్తున్నాయి. అలాకాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే, తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కోవాల్సి రావచ్చు. కులగణన చేశాం, క్యాబినెట్‌లో తీర్మానించాం, అసెంబ్లీలో ఆమోదించాం, ఇక తమ పని అయిపోందని రేవంత్ సర్కారు కనుక చేతులు దులుపుకోవాలని భావిస్తే తప్పులో కాలేసినట్టే. అసెంబ్లీలో చెప్పినట్టుగా అఖిలపక్షం నిర్వహించి, అవసరమైతే ఢిల్లీ తీసుకెళ్లి మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి. మెడలు వంచైనా సరే రిజర్వేషన్లను జనం ముంగిళ్లకు చేర్చాలి. వాటికి రాజ్యాంగ రక్షణ ఉండేలా చూసుకోవాలి. 1948 జనగణన చట్టం ప్రకారం జనగణన, కులగణన చేసే అధికారం కేవలం కేంద్రానిదే. ఇటీవల బీహార్ సర్కారు చేపట్టిన కులగణన కోర్టుకెక్కడమే నిదర్శనం. కులగణన కమిషన్ వేసి లెక్కలు తీసిన తెలంగాణ ప్రభుత్వం, అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. గత పదేండ్లలో పంపిన పలు తీర్మానాలను మోడీ సర్కారు తుంగలో తొక్కిన విషయాన్ని గుర్తుచేస్తున్నది. విద్యా, ఉద్యోగాల్లో ఉన్న రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లోనూ ప్రవేశపెట్టాలని చెబుతున్నది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి తమిళనాడు తరహాలో బీసీలకు రిజర్వేషన్లను తెలంగాణలోనూ అమలుచేసే వీలుంది.

# హర్యానా గెలుపు వెనుక...




చాలామంది కుల పెద్దలు(ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణ లలో తేలింది.హర్యానా ఎన్నికల ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి.రాష్ట్రంలో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు, అగ్నిపథ్ పథకానికి సంబంధించి యువత, భారతీయ జనతా పార్టీ రాజకీయ నాయకుడి లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లు వరుసగా తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపారు. ఈ నిరసనల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని భావించారు. కానీ అన్ని అంచనాలకు భిన్నంగా బీజేపీ ఎన్నికల్లో గెలిచింది. ఈ నిరసనలు జాట్లలో మాత్రమే కేంద్రీకృతమై ఉన్నాయని అప్పుడు వాదించటం జరిగింది. ఈ వాదన ప్రకారం, ఇది ఎన్నికల్లో జాట్ వర్సెస్ నాన్-జాట్ ధ్రువణానికి(పోలరైజేషన్‌కి) దారితీసింది. ఈ విషయంలోని గతిశీలతను అర్థం చేసుకోవ డానికి మేము హర్యానాను సందర్శించి, సింగు సరిహద్దులో జరిగిన రైతుల నిరసనల్లో చురుగ్గా పాల్గొన్న జాట్ రైతులను, ఇతర రైతు నాయకులను కలవాలని నిర్ణయించుకున్నాము. చాలామంది జాట్ రైతులు జాట్ వర్సెస్ నాన్-జాట్ పోలరైజేషన్‌ని ఖండించలేదు. అయితే, బీజేపీ జాట్లను దుర్మార్గులుగా చిత్రించటంవల్లనే ఇది సాధ్యమైందని వారు భావిస్తున్నారు. గ్రామాల్లోని బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కార్యకర్తలు జాట్లకు, జాట్యేతరులకు మధ్య ఉండే చిన్న చిన్న రోజువారీ సమస్యలను ఘర్షణలుగా మార్చటాన్ని వారు గమనించారు. హిందూ-ముస్లింల మధ్య కూడా ఘర్షణలు ఇలాగే జరుగుతాయని, తప్పుడు సమాచారంతో మెజారిటీ సమాజం ప్రభావితమౌతుందని వారు ఇప్పుడు గ్రహించారు. అన్ని కులాలు, వర్గాలు కలిసి జీవిస్తాయని మాతో మాట్లాడినవారిలో చాలా మంది చెప్పారు. జాట్లకు, దళితులకు కూడా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. వారి మధ్య కులాంతర వివాహాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. "మేము కలిసి ఉన్నాము కానీ ఎన్నికల సమయంలో మేము విడిపోతాము" అని ప్రతిస్పందించినవారిలో ఒకరు అన్నారు. దానికి అక్కడ వున్న దళితులు అంగీకరించారు: "అవును. జాట్లు ఓటు వేసే పార్టీకి మేము ఓటు వేయము". నిత్య జీవితంలో పరస్పరం ఆధారపడటమనే పునాదిపై సాగే సామాజిక సహజీవనం అధికారం కోసం జరిగే పోరాటాలను, ఆధిపత్యం, వివక్షతలకు సంబంధించిన ఆందోళనలను నిర్మూలించజాలదనే వాస్తవం ఈ నిగూఢ అంశాన్ని వివరిస్తుంది. రిజర్వేషన్ల ఉప-వర్గీకరణ తర్వాత చమార్లు కాని దళితులు, ఎక్కువగా వాల్మీకులు బీజేపీకి ఓటు వేశారని కూడా జాట్ రైతులు గమనించారు. దళితులు, ఓబిసిలలోనే కాకుండా జాట్లలో కూడా ఇటువంటి విభజనల వల్ల బీజేపీ ప్రయోజనం పొందుతుందనేది ఆసక్తికరమైన విషయం. అన్ని రాజకీయ పార్టీలు ఒక నిర్దిష్ట నియోజకవర్గంలో జాట్ అభ్యర్థులను నిలబెడితే, జాట్లు గోత్రాల వారీగా విడిపోతారు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఈ విధంగా జాట్ ఓట్లలో ఒక భాగాన్ని పొందింది. ఎన్నికలకు ముందు బిపిఎల్ కార్డులను కూడా బీజేపీ ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్డులను ముఖియా లనబడే కుల పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేశారు. వీరిలో చాలామంది రాజకీయంగా బీజేపీతో సంబంధంలో ఉన్నారు. వీరు బీజేపీకి అనుకూలంగా ఉండటానికి ప్రోత్సహకాలు కొంతవరకు కారణం. దళితులు, ఓబిసిలు బీజేపీకి ఓటు వేయడం రాజకీయాల్లో మార్పుకు కారణం కాదని చాలామంది భావించారు. రైతాంగ నిరసనల సమయంలో చురుకుగా పాల్గొన్న ఒక రైతు నాయకుడి నేతృత్వంలో జాట్లు నిర్వహించిన నిరసన ప్రదర్శనను మేము మరింత దూరం పయనించాక చూశాము. స్థానిక జాట్ కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులను హత్య చేసిన కేసులో పోలీసులు ఎటువంటి చర్య తీసుకోకపోవడానికి వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది. ఈ హత్యలను ఒక దళిత యువకుడు చేశాడనే ఆరోపణ ఉంది. అయితే సదరు రైతు నాయకుడు, ఇతరులు దీనిని సామాజిక లేదా కుల సంఘర్షణగా చూడలేదు. అంతేకాకుండా బీజేపీకి ఓటు వేసిన దళితులు తమ తప్పును గ్రహించారని, భవిష్యత్తులో కొత్తగా జాట్-దళిత ఐక్యత ఉద్భవిస్తుందని ఆ రైతు నాయకుడు వాదించారు. అయితే, జాట్‌లు, ఓబీసీలు కలవడం కష్టమని, దానికి కారణం ఓబీసీలు జాట్ నాయకత్వాన్ని అంగీకరించ డానికి సిద్ధంగా లేరని ఆయన అన్నారు. సాపేక్షంగా సమాన స్థాయిగల కులాల కంటే అసమాన స్థాయిలోవున్న కులాలు ఒక కూటమిగా ఏర్పడటానికి అవకాశం ఎక్కువగా ఉంటుందనే సామాజిక కోణాన్ని ఈ అంశం లేవనెత్తుతుంది. సర్ చోటూ రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ జాట్ రైతు నాయకుడి విశ్లేషణ నిజమేనేమో అనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ జాట్ రాజకీయ నాయకులు, కులపెద్దలు మాత్రమే కాకుండా, బిఏఎమ్ సిఇఎఫ్‌కు చెందిన స్థానిక నాయకుడు కూడా కులఐక్యత గురించి అనర్గళంగా మాట్లాడారు. చాలామంది కులపెద్దలు (ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణల్లో తేలింది.

## నామినెటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్

### ఎపి కేబినెట్ కీలక నిర్ణయం



అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ ఈ ఉదయం 11 గంటలకు భేటీ అయ్యింది. ఈ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. నామినెటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కలిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ఏపీ నాలెడ్జ్ సొసైటీ కేపాసిటీ బిల్డింగ్ 2025కు ఆమోదం తెలిపింది. పట్టాదార్ పాస్‌పుస్తకం చట్ట సవరణకు ప్రతిపాదనపై.. గాజువాక రెవెన్యూ పరిధిలో భూములు, నిర్మాణల క్రమబద్దీకరణపై ప్రతిపాదనలపై చర్చ జరుగుతోంది. అదేవిధంగా సాంకేతిక విద్య, ఐసెట్, లా సెట్ పరీక్షలు నిర్వహణ ఒక విద్యా మండలి ప్రత్యేక కమిషనర్ రేటుకు అప్పగించే అంశంపై చర్చిస్తున్నారు. ప్రస్తుతం క్యాబినెట్ సమావేశం కొనసాగుతోంది.

## అప్పుల్లో చంద్రబాబు రికార్డు బద్ధలు : జగన్



తాడేపల్లి : అప్పుల్లో చంద్రబాబు రికార్డు బద్ధలు కొట్టారనిమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యయలంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 9 నెలల్లో చేసిన అప్పులు రికార్డు బద్ధలు కొట్టాయని తెలిపారు. బడ్జెటరీ అకౌఐంట్ అప్పులే రూ.80 వేల కోట్లు.. అమరావతి పేరు చెప్పి చేసిన రూ.52 వేల కోట్లు అప్పు చేశారన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయి ద్వారా మరో రూ.8 వేల కోట్ల అప్పు.. ఏపీఎండీసీ ద్వారా మరో 5 వేల కోట్ల రూపాయల అప్పు.. మొత్తంగా 1 లక్ష 45 వేల కోట్ల రూపాయల అప్పులు చేశారని.. అన్ని అప్పులు చేసినా.. బటన్‌లు నొక్కారా? పేదలకు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. గతప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా, వసతి దీవెన పథకాలు నిలిచిపోయాయని.. మత్స్యకార భరోసా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, లా నేస్తం.. ఇలా పథకాలన్నీ పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గన్నవరంలో విమానాల ల్యాండింగ్‌కు అంతరాయం




విజయవాడ : విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో దట్టమైన పొగ మంచుతో పలు విమానాల ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది. హైదరబాద్ నుంచి వచ్చిన విమానం అర గంటకు పైనే గాల్లో చక్కర్లు కొట్టి.. ల్యాండింగ్‌కు అనుకూలించక పోవడంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళింది. అలాగే, చెన్నై నుంచి వచ్చిన మరో ఇండిగో విమానంతో పాటు ఢిల్లీ నుంచి గన్నవరం రావాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సైతం గాల్లో కాసేపు తిరిగడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ విమాన సర్వీసులను దారి మళ్లీంచినట్టు అధికారులు పేర్కొన్నారు.

## భారతీయుల బహిష్కరణపై చేతులకు సంకెళ్లతో ప్రతిపక్ష ఎంపీల నిరసన




న్యూఢిల్లీ : అమెరికా నుంచి వందలాది మంది భారతీయుల్ని బహిష్కరించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ అంశంపై పార్లమెంటులో ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు వెలుపల గురువారం ప్రతిపక్ష ఎంపీలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమృత్‌సర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి గుర్జీత్ సింగ్ ఔజ్లా ఆందోళనం వ్యక్తం చేశారు. భారతీయుల్ని మిలటరీ విమానంలో తీసుకొచ్చిన పద్ధతి తప్పు. వారికి అవమానం జరిగింది. భారతీయుల్ని పంపిస్తారని కేంద్ర ప్రభుత్వానికి ముందే తెలిస్తే.. వారిని తీసుకురావడానికి వాణిజ్య విమానాన్ని పంపాల్సింది అని గుర్జీత్ సింగ్ అన్నారు. భారతీయులు అమెరికాకు చట్టవిరుద్ధంగా వెళ్లలేదు. అక్కడి వెళ్లిన తర్వాత వారు భారీ నేరాలేమీ చేయలేదు. దీనిపై చర్చించేందుకు తాము స్పీకర్ నోటీసులిచ్చాము అని ఆయన అన్నారు. ఈ బహిష్కరణకు వ్యతిరేకంగా ఆయన చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోసి వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్‌తోపాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు. అమెరికా ప్రభుత్వం చేపట్టిన ఈ అమానవీయ చర్యకు 'భారతీయులు ఖైదీలు కాదు.. మనుషులు' అని ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు.

## అమెరికా నుంచి భారతీయులు బహిష్కరణపై దద్దరిల్లిన పార్లమెంట్




న్యూఢిల్లీ : లఅమెరికా నుంచి భారతీయులు బహిష్కరణపై దద్దరిల్లిన పార్లమెంట్ దద్దరిల్లింది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. రెండు తర్వాత మరలా తిరిగి సభ ప్రారంభం కానుంది. గురవారం ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు వాయిదాల పర్వం కొనసాగుతోంది. నేడు లోక్‌సభ, రాజ్యసభలు ప్రారంభమైన కొద్దిసేపటికే 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తిరిగి ప్రారంభమైనా అదే కొనసాగింది. అమెరికా నుంచి వందలాది భారతీయుల్ని బహిష్కరించడంపై సభలో ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ అంశంపై చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంతో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. సభలో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం చేయవద్దని, ప్రణాళికాబద్ధంగా సభను సజావుగా నడిపేందుకు సహకరించాలని స్పీకర్ ఓంబిర్లా ప్రతిపక్ష ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. భారతీయులు బహిష్కరణకు గురవ్వడం అన్న అంశం విదేశాంగ మంత్రిత్వశాఖకు సంబంధించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిపై ప్రభుత్వం సమాధానం చెబుతుంది అని ఆయన అన్నారు. ఈ విషయంపై విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ రాజ్యసభలో మధ్యాహ్నం 2 గంటలలోపు ప్రకటించే అవకాశం ఉంది.

# బంజార భాషకు గుర్తింపేది?



శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఒకవైపు ప్రపంచీకరణ, సరళీకృత, ఆర్థిక విధానాలు, మరోవైపు సామ్రాజ్యవాద సంస్కృతి తాకిడికి బలవుతున్న మాతృభాషల ఉనికే లేకుండా పోతున్నది. భారత దేశంలో గల ప్రాచీన భాషల్లో బంజారభాష ఒకటి. ఈ భాషకు లిపి లేని కారణంగా నిర్లక్ష్యానికి గురవుతూ అంతరించిపోయే దశలో ఉన్నది. ఈరోజు ఆంగ్లం నేడు అంతర్జాతీయంగా రూపాంతరం చెందుతున్నది. అవసరమే కానీ, మాతృభాషపై రోజురోజుకూ మమకారం తగ్గుతున్నది. ఆంగ్లభాషపై పట్టు సాధించుకునే క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. కనుమరుగయ్యే భాషల్లో బంజారాలు మాట్లాడే గోర్-బోలి భాష కూడా ఒకటి. లంబాడీ (గిరిజన) భాషకు నేటికీ గుర్తింపు లేదు, లిపి లేదు. వీరు మాట్లాడే భాషలు మౌఖికంగా నోటికే పరిమితమవడం మూలాన అత్యంత నిరాధారణకు గురవుతున్నది. పర్యవసానంగా లంబాడీ (బంజారా) తెగల ప్రత్యేక సాంస్కృతిక సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. భారత రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్‌లో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన పది కోట్ల మంది జనాభా వుంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికి 22 భాషలు అధికారికంగా గుర్తించబడగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, డోంగ్రీ, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటుదక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, లాంటి రాష్ట్రాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజారాలు దాదాపుగా 18 కోట్ల జనాభా కలిగి దేశంలో హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్ బోలిని మాట్లాడుతున్నారు. కానీ అతి పెద్ద సమూహం ఉన్న లంబాడీ భాషకు రాజ్యాంగబద్ధ గుర్తింపు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నవి. ప్రస్తుతం జంజారాలు భాష ద్వారానే సంస్కృతీ, సాంప్రదాయాలు, ఆచారాలతో తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. కానీ పాలక వర్గాలు బంజారాలతో పాటు కొన్ని రకాల తెగల భాషలకు లిపి లేదన్న సాకుతోనే ఇతర భాష లను వారిపై రుద్దడం వల్ల వారు విద్యకు, సమగ్రాభివృద్ధికి దూరమవుతున్నారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు బలవంతంగా రుద్దబడిందనే విమర్శలు ఉన్నాయి.ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్‌విఎం)ద్వారా బంజార భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి ఆయా భాషాసంబంధ బోధకులను కూడా నియమించింది. ఇలా కొంత ప్రయత్నం చేసినా, కాని కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పనిచేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్-బోలిని భాషను చేర్చలన్నా ఈ డిమాండ్ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ ఉంది. భాషను బతికించుకోవడానికి జంజారాలు వివిధ రూపాల్లో పోరాడుతున్నా సమస్య పరిష్కారానికి నోచలేదు. బంజారా తెగ గుర్తింపు పరిరక్షణకు కీలకమైనది గోర్-బోలి భాష. అది భాష మాత్రమే కాదు అది బంజారాలకు ఆత్మవంటిది. ఒక జాతి ఎప్పుడు అయితే తన భాషను పరంపరలో మరచిపోతుందో, తదనంతర కాలంలో భాషతో పాటు జాతి కూడా అంతరించిపోతుంది. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా బంజారాల భాష పట్ల పాలకులు తగిన శ్రద్ధ వహించడం లేదనేది బంజరాల భాషను చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటికైనా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 344(1), 351 ప్రకారం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యుల్‌లో గోర్-బోలి భాషను చేర్చాల్సిన అవసరం ఉన్నది. కనుమరుగువుతున్న భాషకు తగిన ప్రోత్సాహమిచ్చి దాన్ని బతికించాలని బంజారాలు కోరుతున్నారు.

# కేన్సర్ నివారణకు అవగాహనే కీలకం



ఆధునిక జీవనశైలి, క్రమరహిత ఆహారపు అలవాట్లు, ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్ వినియోగం, కాలుష్యం తదితర కారణంగా కేన్సర్ కేసులు గత దశాబ్దంలో మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పెరిగాయి. ప్రతి సంవత్సరం లక్షల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారు. పెరుగుతున్న కేన్సర్ ప్రభావంపై దృష్టిని ఆకర్షించడానికి, ఎదుర్కొనే చర్యలను ప్రోత్సహించడానికి, అవగాహన కల్పించడం, గుర్తింపు, నివారణ, చికిత్సను మెరుగుపరచడానికి ప్రతీ ఏడాది ఫిబ్రవరి 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 2025 థీమ్ యునైటెడ్ బై యూనిక్. ఈ దినోత్సవం 4 ఫిబ్రవరి 2000న పారిస్‌లో జరిగిన ప్రపంచ కేన్సర్ సదస్సులో నిర్ణయించబడింది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, కేన్సర్ గురించి అపోహలను తొలగించడం, కేన్సర్ సంబంధిత ప్రచారాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, సకాలంలో కేన్సర్‌ను గుర్తిస్తే నూటికి నూరు శాతం నయం చేయొచ్చని అవగాహన కల్పించడమే ఈ రోజు లక్ష్యం. కేన్సర్ అనేది శరీరంలోని ఏదైనా అవయవం లేదా కణజాలాన్ని ప్రభావితం చేసే వ్యాధుల పెద్ద సమూహం. ఇది అనియంత్రితంగా విభజించే కణాల అసాధారణ పెరుగుదలను సూచిస్తుంది. ఇది శరీర భాగం లేదా అవయవం లేదా కణజాలం నుండి మరొక దానికి వ్యాపించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.మానవ శరీరంలోని కణాల పెరుగుదలను ఎప్పుడు ప్రారంభించాలి? ఎప్పుడు ఆపాలి? లాంటి సూచనలను కణాలకు వాటిలోని జన్యువులు సమాచారాన్ని పంపుతాయి. ఆరోగ్యవంతమైన కణాలు ఈ సూచనలను పాటిస్తాయి. కానీ కేన్సర్ కణాలు వాటిని విస్మరిస్తాయి. సాధారణ కణాలు కేన్సర్ కణాలుగా మారినప్పుడు అవి అసాధారణంగా అనేక రెట్లుగా వ్యాప్తి చెందుతాయి. కేన్సర్లలలో సుమారుగా వందకు పైగా రకాలు ఉన్నాయి. ఇవి మూడు విస్తృత కేన్సర్లుగా వర్గీకరించబడ్డాయి. అవి ఘన (సాలిడ్) కేన్సర్లు, రక్త కేన్సర్లు, మిశ్రమ కేన్సర్లు. కేన్సర్ లక్షణాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటాయి. ఇవి ఒక వ్యక్తికి ఏ రకమైన కేన్సర్ ఉంది? అది ఎంత అభివృద్ధి చెందింది? అనే దానిపై ఆధారపడి ఉంటాయి. కేన్సర్ రావడానికి ఒకే ఒక్క కారణం లేదు. కానీ కొన్ని కారకాలు అభివృద్ధి చేసే అవకాశాన్ని పెంచుతాయి. అవి జన్యుకారకాలు, పొగాకు వినియోగం, అనారోగ్యకరమైన ఆహారం, శారీరక నిష్క్రియాత్మకత, పర్యావరణ కారకాలు, పోషకాహార లోపం, కొన్ని రకాల రేడియేషన్లు, కాలుష్యం లాంటివి ప్రధానమైనవి. ప్రపంచ వ్యాప్త మరణాలకు కేన్సర్ రెండవ అతి ప్రధాన కారణం. అంతర్జాతీయ కేన్సర్ పరిశోధనా ఏజెన్సీ గణాంకాల ప్రకారం 2022లో రెండు కోట్లు కొత్త కేన్సర్ కేసులు, 97 లక్షల మరణాలు సంభవించాయి. ఊపిరితిత్తుల కేన్సర్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణంగా సంభవించే క్యాన్సర్. ఇవి 25 లక్షలు కేసులుతో (12.4%) ప్రథమ స్థానంలోనూ, స్త్రీలలో రొమ్ము క్యాన్సర్లు 23 లక్షల (11.6%) కేసులుతో రెండవ స్థానంలో ఉన్నాయి. కొలొరెక్టల్ కేన్సర్ 19 లక్షల (9.6%) కేసులతోను, ప్రోస్టేట్ కేన్సర్ 15 లక్షల (7.3%) కేసులు, పొట్ట కేన్సర్ 9.7 లక్షల (4.9%) కేసులతో తరువాత స్థానాలలో ఉన్నాయి. పురుషులలో ప్రోస్టేట్, కొలొరెక్టల్ కేన్సర్లు సాధారణంగా సంభవించే కేన్సర్లలో రెండవ, మూడవ స్థానంలో ఉన్నాయి. 18 లక్షల (18.7%) మరణాలతో ఊపిరితిత్తుల క్యాన్సర్, కొలొరెక్టల్ కేన్సర్లతో 9 లక్షలు (9.3%), కాలేయ కేన్సర్లతో 7.6 లక్షలు (7.8%), బ్రెస్ట్ కేన్సర్లతో 6.7 లక్షలు (6.9%), పొట్ట కేన్సర్లతో 6.6 లక్షలు (6.8%) చనిపోయారు. మహిళలలో ప్రధాన కారణం రొమ్ము కేన్సర్ అయితే పురుషులలో ఊపిరితిత్తుల కేన్సరుగా ఉంది. 2023లో మన దేశంలో 14,96,972 కేన్సర్ కేసులు నమోదయ్యాయని నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. 2040 నాటికి భారతదేశంలో ఈ కేసులు రెట్టింపు అవుతాయని అంచనా. ప్రతి ఏడాది ఎనిమిది లక్షల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో నోరు, ఊపిరితిత్తులు, తల, మెడ కేన్సర్లతో సహా పొగాకు సంబంధిత కేన్సర్లు ప్రబలంగా ఉన్నాయి. ఈ కేన్సర్లు చాలా వరకు నివారించదగినవి. కేన్సర్ కేసుల పెరుగుదలకు చాలా మంది రోగులు స్టేజ్ 4 లో ఉండటం పేలవమైన ఫలితాలకు దారితీస్తుంది. వైవిధ్యమైన జనాభా, ఆరోగ్య సంరక్షణ అసమానతలు ఉన్న మన దేశంలో ప్రారంభ రోగ నిర్ధారణ, చికిత్సకు సమాన ప్రాప్యతను అందించడంలో సవాళ్లను ఎదుర్కొంటోంది. సాధారణ స్క్రీనింగ్‌లు, ముందస్తుగా గుర్తించడం అనేది మనుగడ రేటును మెరుగుపరచడంలో సహాయపడే రెండు ప్రధాన అంశాలు. ప్రస్తుతం శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోన్ థెరపీ, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్లు, ఎమ్‌ఆర్‌ఎన్ఎ టీకాలు లాంటి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఏదేమైనా వివిధ రకాల కేన్సర్లను నివారించవచ్చు. విస్తృతమైన అవగాహన, సకాలంలో జోక్యం చేసుకోవడం ద్వారా కేన్సర్ భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అన్నింటి కంటే ప్రధానమైంది కేన్సర్‌ను ముందుగా గుర్తించడం.

# కాలుష్యంపై కానరాని హామీ!



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బహుశా తొలిసారిగా ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌కు ప్రతిష్ఠాత్మకం కాబోతున్నాయి. పార్టీ నేతలు జైలుకు వెళ్లి రావడం, కేజ్రీవాల్ సిఎంగా తప్పుకోవడం వంటి పరిణామాల మధ్య ఎన్నికలు ఈ నెల 5న జరుగబోతున్నాయి. అయితే బిజెపి కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎప్పుడూ లేని విధం గా వరాల జల్లుతో మేనిఫెస్టో విడుదల చేసింది. ఉచిత పథకాలకు తానేమీ తీసిపోనని చెప్పుకుంది. కానీ ఏ ఒక్కరూ ఢిల్లీ కాలుష్యంపై మాట్లాడడం లేదు. కేవలం ఉచిత పథకాలకే పరిమితం కావడం గమనార్హం. అయితే దేశ రాజధాని కావడంతో మోడీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ముక్కోణపు పోటీ జరుగుతోంది. ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంటూ వస్తున్న బిజెపి ఈసారి ఎట్లాగైనా అధికారం చేపట్టాలని పట్టుదలగా ఉంది. పదేళ్ల ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రభుత్వ వ్యతిరేకత అందుకు అనుకూలం కాగలదని ఆశిస్తున్నది. మొహల్లా క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో కొంతమేరకు కేజ్రీవాల్‌కు దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి సాధింపలేని పాలనా విజయాలు సాధించినా గెలుపుకోసం అవి మాత్రమే సరిపోవు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన, అపరిశుభ్రమైన దేశ రాజధానిగా నేడు ఢిల్లీ అప్రతిష్ఠకు గురవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా అభివృద్ధి చెందినా, ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయంగా భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటు చూసినా కనిపించే వ్యర్థ పదార్థాలు. ఇవి కాకుండా కాలుష్యానికి కారణం అవుతున్నాయి. ఇవన్నీ కలిసి రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత, వైఫల్యాలు ప్రజల ముందు నిలుస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజ్రీవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులు అనేక మంది వెళ్లడం కూడా ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఆ కేసులు అన్ని రాజకీయ కక్ష సాధింపుగా నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు ఏవీ న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు ఉన్నా, లేకున్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెను సవాల్‌ను ఇప్పుడు ఆయన ఎదుర్కొంటున్నారు. మరోవంక బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడంతో 2014 నుండి వరుసగా మొత్తం 7 లోక్‌సభ సీట్లను గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపికు పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతుంది. కానీ ఇతర పార్టీల మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో మొదటిసారిగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. 'శేష్ మహల్' గురించి కొంతమేరకు కేజ్రీవాల్‌ను ఇరకాటంలో పడవేసినా, బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి అద్భుతమైన ప్రచారాల వివరాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బిజెపి తమ ప్రచారాన్ని మార్చివేశారు. ఒక్కసారి అధికారం ఇస్తే ఢిల్లీ రూపురేఖలను తాము మాత్రమే మార్చగలము అని చెప్తున్నారు. ఢిల్లీ తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న సమయంలో పొరుగునున్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేక పోయింది. ఢిల్లీలోని దళితుల మద్దతు పొందటం బిజెపికి ఓ సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి కేజ్రీవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ బిజెపిలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు బిజెపి వెనకాడుతుంది. పైగా పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే గెలుపొంది ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, ప్రజాదరణతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తున్న బిజెపి ఢిల్లీలో సైతం కేవలం ప్రధాని మోడీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతుంది. అయితే గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ఓటర్లను ఆకర్షించడంతో మోడీకి సైతం పరిమితులున్నాయని స్పష్టం కావడం బిజెపికి ప్రమాద సంకేతాలను సూచిస్తున్నది. అందుకనే ఢిల్లీ ఎన్నికలు బిజెపి నాయకత్వంపై అగ్నిపరీక్షగా మారాయి. ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజ్రీవాల్, అఖిలేశ్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుంది. బిజెపికి సైతం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కాకుండా మరో నాయకుడు మోడీకి పోటీగా ఎదగడం ఇష్టం లేదు. అందుకనే కేజ్రీవాల్‌ను ఓడించడం ఆ పార్టీకి చాలా అవసరంగా ఉంది. ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓ రకంగా ఏకాకిగా పోటీ చేస్తున్నది. ప్రతిపక్షాలు ఆప్ పట్ల సానుకూలత వ్యక్తంచేయడం రాబోయే రోజులలో జాతీయ స్థాయిలో ఆ పార్టీ మరింత ఏకాకిగా మారే సంకేతాలను అందిస్తున్నది. దేశ రాజధాని అసెంబ్లీ ఎన్నికలలో ఏపార్టీ కూడా కాలుష్యంపై హామీ ఇవ్వకపోవడం, ఏ పార్టీ చూసినా కానీ ఉచితాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు గాని కాలుష్యం లేని ఢిల్లీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామని చెప్పడం లేదు.